సమావేశము - IV
వాల్యూము - II
సెం. 3

వెల : రూ. 14-00
20 మార్చి, 2016
ఆదివారం,
(శక సం. 1937,
ఫాల్గుణం - 30)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక

I. 2016-17 సంవత్సరానికి వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్)పై ఆర్థిక మంత్రి ప్రత్యుత్తరం ... 1

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటి ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (నాల్గవ సమావేశము - ఎనిమిదవ రోజు)

## ఆదివారం, మార్చి 20, 2016

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ ఛైర్మన్: ముందుగా అందరికీ సంతోషకరమైన విషయం ఏమంటే - నేడు గౌరవనీయులు ఆర్థికశాఖామాత్యులు, అన్న శ్రీ ఈటల రాజేందర్ గారి జన్మదినం సందర్భంగా, సభలో వున్న అందరి సభ్యుల పక్షాన, శాసన మండలి పక్షాన, మనందరి పక్షాన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను .

(ఈసందర్భంగా సభలో ఉన్న సభ్యులందరూ శ్రీ ఈటల రాజేందర్ గారి దగ్గిరికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. )

2016-17 బడ్జెటుపై జరిగిన సాధారణ చర్చకి ఆర్థిక శాఖామాత్యులు సమాధానం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

### I. 2016-2017 సంవత్సరానికి వార్షిక ఆదాయవ్యయ పట్టిక (బడ్జెట్) పై ఆర్థిక మంత్రి ప్రత్యుత్తరం.

శ్రీ ఈటల రాజేందర్ : అధ్యక్షా, పెద్దలందరి ఆశీర్వాదాలు దొరికినందుకు సంతోషిస్తూ, మీకందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. 2016-17 బడ్జెటుపై జరిగిన చర్చలో పాల్గొని అనేక విలువైన సూచనలు, సలహాలు ఇచ్చినటువంటి గౌరవ సభ్యులందరికీ, చర్చలో పాల్గొన్న నా సహచర మిత్రులందరికీ కూడా పేరు పేరున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. గౌరవనీయులు మహ్మద్ ఆలీ షబ్బీర్ -యల్ఓపి గారు, పాతూరి సుధాకర్ రెడ్డి గారు-టిఆర్యస్, రామచంద్రరావు గారు - బిజెపి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిగారు-టిఆర్యస్, పూల రవీందర్‌గారు-పిఆర్‌టియు, పొంగులేటి సుధాకర్‌రెడ్డిగారు-కాంగ్రెస్,యాదవ రెడ్డి గారు -టిఆర్యస్, కర్నె ప్రభాకర్‌గారు-టిఆర్యస్, అల్తాఫ్ హైదర్ రజ్వీ గారు-యంఐయం, శ్రీమతి ఆకుల లలిత గారు -కాంగ్రెస్, భూపతిరెడ్డి గారు-టిఆర్యస్, పట్నం నరేందర్‌రెడ్డి గారు-టిఆర్యస్, నారదాసు లక్ష్మణరావు గారు-టిఆర్యస్, భూపాల్‌రెడ్డి-టిఆర్యస్, పురాణం సతీష్ కుమార్ గారు-టిఆర్యస్, ఫారూక్ హుస్సేన్-నామినేటెడ్, రాజేశ్వరరావు-నామినేటెడ్, రాజగోపాల్‌రెడ్డి-కాంగ్రెస్, యం.యస్. ప్రభాకర్‌రావు-కాంగ్రెస్ పార్టీ, రాములు నాయక్-నామినేటెడ్, రంగారెడ్డి-కాంగ్రెస్ ... చర్చలో పాల్గొని విలువైన, అనుభవపూర్వకమైన సలహాలు ఇచ్చారు.

ఈ సభలో ఆ చర్చలు వినే అవకాశం లేనప్పటికీ కూడా పెద్దలు మాట్లాడిన మాటలన్నీ కూడా చదువుకున్నాను. మరీ ముఖ్యంగా యల్ఓపి గారికి అనేక సంవత్సరాలుగా మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది, వారి రాజకీయ అనుభవం కూడా చాలా పెద్దది కాబట్టి చాలా గొప్ప సూచనలు చేశారు. ఈ రాష్ట్రానికి ఒక పెద్ద మనిషిలాగా, భావి తరాలకు ఆదర్శంగా ఉండాలి కాబట్టి, మన నిర్ణయాలు భావి తరాలకు లాభం చేకూర్చేలా ఉండాలి కాబట్టి ఆవిధంగా వారు సూచనలు, సలహాలన్నీ చేశారు.

అసెంబ్లీలో ఏఏ అంశాలైతే చర్చకు వచ్చాయో, శాసన మండలిలో కూడా ఇంచుమించుగా అదే అంశాలు ప్రస్తావనకు రావడం జరిగింది. 2016-17 బడ్జెట్‌కి సంబంధించిన



J.84-1 [G]

గణాంకాల విషయాలు చర్చించుకునే ముందు ఒక విషయాన్ని మాత్రం ఈరోజు సగర్వంగా మనం చెప్పుకోవలసిన అక్కర ఉంది. ఆనాడు తెలంగాణ ఉద్యమం కొనసాగుతున్నపుడు .. మీకు పరిపాలించుకునే నైపుణ్యం ఉంటుందా? తెలంగాణ రాష్ట్రం వస్తే హైదరాబాదు అల్లకల్లోలం అవుతుంది, మత కలహాలకు నిలయం అవుతుంది, లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయలేరు, మీరు లేచేదే పది గంటలకు, మీరు నిజాం వారసులు, మీకు ఎక్కడ పని వస్తుంది, మీకు చదువు నేర్పింది మేమే, వంట నేర్పింది మేము ... ఇలా ఎన్నో రకాలుగా మనల్ని ఆనాడు దెప్పి పొడిచారు.

అధ్యక్షా, తెలంగాణ ప్రభుత్వం 21 నెలల్లో సాధించిన గొప్ప విషయం ఏమంటే – పెద్ద ఎత్తున పెన్షన్లు ఇవ్వడం మేము విజయంగా భావించడం లేదు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం విజయంగా మేము భావించడం లేదు. తెలంగాణ ప్రభుత్వం 21నెలల్లో సాధించిన గొప్ప విషయం ఏమంటే, ఆనాడు వాళ్లు చెప్పినట్లుగా ఈ రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరాకు కాలేదు, సగర్వంగా కాలర్ ఎగరేసి ఇది మా రాష్ట్రంఅని చెప్పుకునే గొప్ప వాతావరణ కల్పనకు ఈ 20, 21 నెలల పాలన తోడ్పడిందని మనవి చేస్తున్నాను. ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా అనేక మంది రాజకీయ పండితులు కావచ్చు, మేధావి వర్గం కావచ్చు, ఇన్వెస్టర్స్ కావచ్చు .. ఈరోజు తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ఆస్కారమున్న రాష్ట్రంగా, హైదరాబాదు సేఫెస్ట్ జోన్‌గా, ఇక్కడ పెట్టుబడులు పెడితే గొప్పగా సక్సెస్ అవుతాయనే భావన కల్పించడమే గాకుండా, ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలకు అవార్డులు రావడమే గాకుండా, పత్రికలలో పతాక శీర్షికన మనకు అప్రిషియేషన్ రావడమే గాకుండా, మనం తీసుకున్న మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూము ఇళ్లు వంటి కార్యక్రమాలను దేశంలో అనేక మంది ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్న పరిస్థితి వచ్చిందంటే, ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన విధానం ఎలా ఉందో అర్థమవుతోంది.

తెలంగాణ రాజకీయ వ్యవస్థకి పరిపాలనా నైపుణ్యం లేదన్న స్థాయి నుంచి తెలంగాణ రాజకీయ వ్యవస్థకి ఒక విధానం ఉంది, పేద ప్రజల సంక్షేమం పట్ల కమిట్‌మెంటు ఉందనే భావన ఈరోజు కలిగింది. పార్టీలు ఏవైనా కావచ్చు కానీ తెలంగాణ బిడ్డలకి, తెలంగాణ ప్రజాక్షేత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, యంపీలుగా ఉన్న వారికి దేశ వ్యాప్తంగా, తెలంగాణ వ్యాప్తంగా మనకి ఏదైతే అప్రిషియేషన్ వస్తోందో అది సజీవ సాక్ష్యం. అది దొరికినందుకు మనందరమూ సంతోషిస్తున్నాం.

ఈరోజు తెలంగాణ రాష్ట్రం గొప్పగా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉన్న రాష్ట్రంగా పునాది వేసుకున్నాం, భావి తరాలకు ఈరోజు భరోసా ఇవ్వగలిగాం. రాష్ట్రాలు విడిపోవడం సహజమైనది, అవసరమైనది, ఈదేశంలో ఏవైతే పెద్ద రాష్ట్రాలుగా ఉన్నాయెూ అవి చిన్న రాష్ట్రాలుగా విడిపోయాయి, విడిపోయిన రాష్ట్రాలు అభివృద్ధి చెందాయని ఆనాడు మేము ఉద్యమ సమయంలో చెప్పాం. మహారాష్ట్ర నుంచి గుజరాతు, పంజాబు నుంచి హర్యాన, నిన్న మొన్న మధ్యప్రదేశ్ నుంచి విడిపోయిన ఛత్తీస్‌ఘడ్ ఇవన్నీ కూడా గొప్పగా అభివృద్ధి చెందిన, చెందుతున్న రాష్ట్రాలుగా మిగిలాయి. రాష్ట్రం విడిపోవడం అభివృద్ధికి సూచికే తప్ప నెగెటివ్‌గా, తిరోగమనం కాదని ఏదైతే మేము ఆనాడు ఉద్యమ సమయంలో చెప్పామో అది అక్షరాలా నేడు రుజువైందని సగర్వంగా ప్రకటిస్తున్నాం.

విడిపోయి అన్నదమ్ముల్లా కలిసి ఉందాం, విడిపోయి పరస్పరం అభివృద్ధి చెందుదామని ఆనాడు మేము చెప్పింది అక్షరాలా నిజమైంది. ఎక్కడా కూడా వైషమ్యాలు, సంకుచిత ధోరణి లేకుండా, ఆ ప్రాంతం వాళ్లు ఈ ప్రాంతం వాళ్లు అన్నదమ్ముల కంటె ఎక్కువగా, ఊహించిన దానికంటె ఎక్కువగా కలిసిమెలిసి ఉన్న వాతావరణం ఈరోజు ఉంది. హైదరాబాదులో ఉండే అన్ని వర్గాల ప్రజలు గుజరాతీలు కావచ్చు, రాజస్థానీలు కావచ్చు, నార్త్ ఇండియన్స్ కావచ్చు, సౌత్ ఇండియన్స్ కావచ్చు, ఆంధ్రప్రదేశ్ ప్రజలు కావచ్చు, ఏ దేశం నుంచి వచ్చిన వాళ్లయినా కావచ్చు, తెలంగాణ safest State, safest City Hyderabadఅనే విశ్వాసం ఆ ప్రజల్లో కలిగించినందుకు నిజంగా గర్వంగా ఉంది. ఈ

సాంప్రదాయాలను, ఈ పద్ధతులను ముందు ముందు సమిష్టిగా నడుపుకుందామని, సమిష్టిగా దీన్ని డెవలప్ చేసుకుందామని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, గతంలో కూడా అనేకసార్లు చెప్పాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అందరి భాగస్వామ్యం ఉంది, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అందరి త్యాగాలున్నాయి, తెలంగాణ రాష్ట్రమన్నది అందరమూ కలిసికట్టుగా మూడు తరాలుగా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కాబట్టి, ఆ పోరాటం ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఈరోజు గొప్పగా అభివృద్ధి చెందితే చూసి సంతోషపడాలని ప్రజలు భావిస్తున్నారు.

అందులో భాగంగా మన సంతోషాన్ని కూడా వ్యక్తం చేస్తున్నాం. ఆ కోణంలో మన బడ్జెటును ప్రవేశపెట్టుకున్నాం. అధ్యక్షా, 2014-15లో మనం బడ్జెటు ప్రవేశపెట్టినపుడు, మీకు తెలుసు, యల్‌ఓపిగారికి కూడా బాగా తెలుసు. మూడు సంవత్సరాల బడ్జెటు ఖచ్చితంగా ఉండవలసిందే. ఒక సంవత్సరం యాక్చువల్స్, రెండో సంవత్సరం సవరించిన అంచనాలు, మూడో సంవత్సరం అంచనాలు ఉంటాయి కాబట్టి, 2014లో మనకు ఆ చరిత్ర లేదు, ఆ అనుభవం లేదు, ఆ గణాంకాలు లేవు కాబట్టి మనం ఇదమిద్ధంగా కొంత నిర్ణయించుకున్న మాట వాస్తవం. ఆనాటికే ఒక బడ్జెట్ పెట్టబడింది. జూన్ రెండో తేదీన రాష్ట్రం ఏర్పడితే మనం బడ్జెటు పెట్టుకున్నది నవంబర్ మాసంలో.

నవంబర్ మాసంలో ఫస్ట్ బడ్జెట్ పెట్టుకుంటే, మూడు మాసాల తర్వాత రెండో బడ్జెటు పెట్టుకున్నాం. ఆనాడు రూ.1,00,637.96కోట్లు పెట్టుకున్నాం. దాన్ని పెట్టుకోవడానికి నేపథ్యం ఏమంటే – కొత్త రాష్ట్రం కాబట్టి, వెనకబాటుతనానికి నిలయమైన రాష్ట్రం కాబట్టి, ఆనాటికే తెలంగాణాలోని పది జిల్లాలలో తొమ్మిది జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా గుర్తించబడి ఉన్నాయి కాబట్టి, కేంద్రం కనికరించి ఏమైనా సహాయం చేస్తుందనే ఆశతో, వివిధ కారణాలతో ఈ బడ్జెటు పెట్టుకున్నాం. కానీ అనుకున్నట్లుగా జరగలేదు. అలోకేట్ చేసుకున్న బడ్జెటులో కేవలం 61.91శాతం మాత్రమే ఖర్చు పెట్టబడింది 2014-15వ సంవత్సరంలో. దానికి గల కారణాలు నేను మళ్లీ వివరించవలసిన అవసరం లేదు కానీ ఒకసత్యం ఏమంటే ఇప్పటికీ ఉద్యోగుల పంపిణీ పూర్తి కాలేదు. ఐఏయస్ అధికారుల పంపిణీ మొన్న మొన్న పూర్తి అయింది.

అంతేగాకుండా అనేక నెలలుగా మొట్టమొదటి సంవత్సరం మనకు కేంద్రం నుంచి రావలసిన డబ్బులు పాత రాష్ట్రానికి చెందిన అకౌంటులోకి పోయిన సందర్భం కూడా ఉంది. మూడు, నాలుగు నెలల వరకు యన్‌ఆర్‌ఇజియస్ వంటి వాటికి సంబంధించి కేంద్రం నుంచి వచ్చే డబ్బులు కూడా ఎ.పి. అకౌంటులో జమ అయ్యాయి కానీ తెలంగాణ అకౌంటులో జమ అయిన పరిస్థితి లేదు. ఇలా రకరకాల కారణాల వల్ల ఆనాడు కొంత నష్టం జరిగింది. అంతేగాకుండా ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోతున్నపుడు మనకి జనాభా ప్రాతిపదికపై జియస్‌డిపి నిర్ణయించారే తప్ప యాక్చువల్‌గా ఏదైతే ప్రొడక్షన్ ఉందో దాని ప్రకారం చేయకపోవడం వల్ల కొంత నష్టం జరిగింది. జియస్‌డిపిలో మన వాటా 49శాతంగా ఉండాలి కానీ జనాభా ప్రాతిపదికపై 42శాతంగా నిర్ణయించడం వల్ల కొంత అప్పు తెచ్చుకునే వెసులుబాటు లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే డబ్బులు, అప్పులు తెచ్చుకోవడంకానీ, రాబడి విషయంలో గానీ ఇతరత్రా కారణాల వల్ల మనకి గొప్పగా రాకపోవడం వల్ల అచీవ్‌మెంటు చేయలేకపోయాం. ఆవిషయాన్ని యల్‌ఓపి గారు ప్రస్తావించారు. దాన్ని బాజాప్తుగా బడ్జెటు పుస్తకంలో ప్రస్తావించడం జరిగింది.

మొదటి సంవత్సరంలో మీకు లెక్కలు లేవు, కానీ రెండో సంవత్సరంలో కొంత వాస్తవికత ఉండాలి కదా అన్నారు. మీకు తెలుసు, నవంబర్ మాసంలో మొదటి బడ్జెటు పెట్టుకుంటే, మూడు మాసాల తర్వాత మళ్లీ బడ్జెటు పెట్టుకున్నాం. సిఏజి వాళ్లు మూడు మాసాలకు ఒకసారి ఆడిట్ చేస్తారు. అప్పటికప్పుడు ఆడిట్ చేసే ఆస్కారం లేదు కాబట్టి రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కి ఆస్కారం లేకుండానే బడ్జెటు రూపకల్పన చేసుకున్న విషయం తమరికి తెలుసు. మనకి రివైజ్డ్ ఎస్టిమేట్స్ కూడా లేవు. As it is గా 2014-15 బడ్జెట్‌కి రివైజ్డ్ ఎస్టిమేట్స్ పెట్టుకోవడం జరిగింది. దీంట్లో మనం కొంత పురోగతిని సాధించాం. ఆనాడు మనం పెట్టుకున్న బడ్జెట్

రూ.115689.20 కోట్లు. దీంట్లో రూ.1061.87 కోట్లు రివైజ్డ్ ఎస్టిమేట్స్‌గా మేము చూపెట్టడం జరిగింది. అక్కడ అసెంబ్లీలో గానీ, ఇక్కడ యల్ఓపి గారు గానీ లేవనెత్తిన అంశాలు ఏమంటే - అయ్యా, ఈనాడు మీరు ఖర్చు పెడుతున్న డబ్బు రూ. 80,000 కోట్లకి పైగా మాత్రమే ఉంది, రూ. 1,00,000 కోట్లకు వచ్చే అవకాశం లేదు, మళ్లీ తప్పు చేశారు, మళ్లీ మీరు అంకెల గారడీ చేశారనే విమర్శలు వచ్చిన మాట వాస్తవం.

కానీ ఎక్కడా కూడా అంకెల గారడీ చేసి, మసిపూసి మారేడు కాయ చేసిన సందర్భాలు లేవు. ఇవి దాచితే దాగేవి కాదు. ఇంకా మూడు నెలలు పోతే 2025-16 కి సంబంధించి, రివైజ్డ్ బడ్జెట్ ఏదైతే ఉందో అది మీకళ్లముందు ఆవిష్కరించబడుతుంది. ఈసంవత్సరం వరకు, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ - చివరి క్వార్టర్ ఏదైతే ఉందో ఆ క్వార్టర్‌కి మాత్రమే మనకి లెక్క ఉంది, అప్పటి వరకే రికార్డ్స్ ఉన్నాయి కాబట్టి ఆ రికార్డుల ప్రకారం మొన్న డిసెంబరు నాటికి రూ.66,647.87కోట్లలో నాన్ ప్లానం క్రింద రూ.40,965.78కోట్లు, ప్లాన్ క్రింద రూ.25,603.01కోట్లు మాత్రమే, ఇది డిసెంబరు చివరి నాటికి మాత్రమేనని తెలియజేస్తున్నాను.

ఇక్కడొక విషయం గుర్తు చేయదలుచుకున్నాను. రూ.80,000 కోట్లు లేదా రూ.82,000 కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగారు కదా, ఇంకా పదిహేను రోజులు మాత్రమే ఉంది, ఇంకా లక్ష కోట్లు రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో పెట్టారు, ఇది తప్పు కదా అని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చికి సంబంధించిన రియల్ ఆడిట్ అకౌంట్స్ ఇంకా రాలేదు. గతానికి సంబంధించిన అనుభవాలను ఒకసారి చెబుతాను. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ బడ్జెటు ఒక ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలాగా, ఒక ప్రైవేటు వ్యక్తికి సంబంధించిన బడ్జెటులా ఉండదు. అంచనాలు మాత్రమే ఉంటాయి. గత సంవత్సరం, అంతకు ముందు సంవత్సరం ఎలా ఉందనే విషయాన్ని తర్కించుకొని, ప్రపంచ వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఉండే ఎకానామిక్ గ్రోత్‌ని గమనంలోకి తీసుకొని, ఇక్కడ ఉండే పరిస్థితులను తెలుసుకొని దాని ఆధారంగా మాత్రమే పెట్టుకుంటాం.

దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ ఎక్కడా కూడా ప్లాన్ బడ్జెటులో గానీ, నాన్ ప్లాన్ బడ్జెటులో గానీ వందకి వంద శాతం ఖర్చు అయ్యే సందర్భం ఉండదు. ఉంటే నాన్‌ప్లాన్‌లో ఉంటుందేమో కానీ ప్లాన్ విషయంలో మాత్రం ఎక్కడా కూడా నూరు శాతం అచీవ్ అయిన చరిత్ర ఎక్కడా లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 2004-05లో అలోకేట్ అయిన బడ్జెట్ అండ్ ఎక్స్‌పెండిచర్ చూస్తే, ఎక్స్‌పెండిచర్ కేవలం 82 శాతం మాత్రమే ఉంది. దయచేసి సభ్యులు గమనించాలని కోరుతున్నాను. ఆనాడు యల్ఓపి గారు మంత్రిగా కూడా ఉన్నారు. 2004-05లో 82 శాతం, 2005-06లో 83 శాతం, 2006-07లో 86 శాతం, 2007-08లో అది బూమ్ పీరియడ్, రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు, అప్పుడు అలోకేట్ అయిన బడ్జెటులో జరిగిన ఎక్స్‌పెండిచర్ 88శాతం ఉంది. మళ్లీ కొంత రెసెషన్ వచ్చింది. 2008-09లో 67శాతం, 2009-10లో 77శాతం, 2010-11లో 84శాతం, 2011-12లో 88శాతం, 2012-13లో 81శాతం, 2013-14లో తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్న సందర్భంలో 71 శాతం మాత్రమే.

**10.20 ఉ.** lowest expenditure in 2008-09 67 percent. అట్లే కాకుండా చివరి క్వార్టర్లో ఎప్పుడూ కూడా బడ్జెట్‌లో ఎక్కువ ఖర్చు అవుతుంది. ఒక్కొక్క క్వార్టర్‌లో ఎలా ఖర్చు అవుతుంది. చివరి క్వార్టర్‌లో ఎలా ఖర్చు అవుతుందనే విషయాన్ని చెబుతాను. 2011-12లో చివరి క్వార్టర్లో ఖర్చు చేసిన మొత్తం - రూ.35.92 శాతం, 2012-13లో చివరి క్వార్టర్లో ఖర్చు చేసిన మొత్తం - రూ.37.13 శాతం, 2013-14లో చివరి క్వార్టర్లో ఖర్చు చేసిన మొత్తం - రూ.34.02 శాతం, 2014-15లో చివరి క్వార్టర్లో ఖర్చు చేసిన మొత్తం - రూ.46.02 శాతం. ఇలా దీని ప్రకారంగా యావరేజ్ చూసుకున్నా కూడా 36, 37శాతం ఈ క్వార్టర్లో ఖర్చయ్యే ఆస్కారం ఉంటుంది. కాంట్రా ఇంట్రెస్ట్‌లు ఉంటాయి. ఇవన్నీ గనుక కలుపుకుంటే రూ.1,61,087కోట్ల ఈ Revised Estimateని achieve చేస్తామనే విశ్వాసం ఉంది. కాబట్టే ఇవన్నీ మీముందు ప్రవేశపెట్టడం జరిగింది. దీనికి సంబంధించే ఇంకొక ఆరు మాసాల తరువాత, నాకు తెలిసి అక్టోబరు

మాసానికి ఆడిట్ రిపోర్టు వచ్చే ఆస్కారం ఉంటుంది. ఆ లెక్కలు వచ్చిన తరువాత గౌరవ సభ్యులకు పంపిస్తానని చెప్పి తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఒక లక్ష కోట్లు ఖర్చు పెట్టేటువంటి ఈ సంవత్సరంలో రూ.1,15,000కోట్లు మీరు ఇప్పటికే పెట్టుకున్నారు కదా, ట్రెండ్ ఏమిటనేది మీకు తెలుస్తుంది కదా, మరి ఎందుకు మళ్లీ రూ.1,30,000కోట్లు పెట్టుకున్నారనేది వారి argument. వాస్తవమే, ఎందుకంటే మీ అనుభవం, గతంలో ఉన్న గ్రోత్ రేట్స్‌ని బట్టి మీరు చెప్పిన మాట వాస్తవమే.

కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఆచి, తూచి పెట్టుబడులు గానీ, బిజినెస్ గానీ, యాక్టివిటీస్ గానీ పెడుదామని అనుకున్న మాట వాస్తవం. 2014–15లో మనం దేనిని ఆవిష్కరించలేక పోయాము, విశ్వాసం కలిగించలేకపోయాం. కానీ, 2015–16లో టిఎస్–ఐపాస్ లాంటిది గానీ, ఐటి వ్యవస్థలో గానీ, పరిశ్రమల పాలసీలో గానీ, ఇతరత్రా గ్రోత్‌లో గానీ బ్రహ్మాండమైనటువంటి గ్రోత్ ఈరోజు ఉంది. కాబట్టి, అది రాబోయే కాలానికి మరింత పెరిగి కొంత లాభం చేకూర్చే ఆస్కారం ఉంది. ప్రజల అవసరాలు పెరిగాయి. కాబట్టి, ఆ ప్రజల అవసరాలను తీర్చాలనే సంకల్పంలో భాగంగా ఇవాళ ఈ బడ్జెట్ రూపకల్పనా చేశాము.

దానిలో భాగంగా చివరి క్వార్టర్‌కి సంబంధించి చూసుకుంటే State Owned Tax Revenue(SOTR) ఏదైతే ఉందో, దానిలో Excise-35.36%, Vehicles-29.83%, Stamps and Registration-19.61%, VAT-12.56%, Non Taxation Revenue-78.05%, Mines-25%, అంటే అక్టోబరు నుండి డిసెంబరు వరకు ఈరోజు బ్రహ్మాండమైన యావరేజ్‌గా 20శాతం ఉన్నది. తప్పకుండా ఈ క్వార్టర్‌లో బ్రహ్మాండమైన ఆదాయం వచ్చి, వచ్చే సంవత్సరం దీనికంటే ఇంకొక 5 శాతం పెరుగుతుందనే ఆశ ఉంది. అందుకే, ఈ గణాంకాల, ఆదాయాల ఆధారంగా పెంచుకోవడం జరిగిందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

జిఎస్‌డిపి గ్రోత్‌లో కూడా ఈ సంవత్సరం 15శాతానికి పైబడి ఉంటుందని అంచనా వేయడం జరిగింది. అలాగే రు.4,000 కోట్లు వ్యాట్ బకాయిలున్నాయి. గతంలో కోర్టులకు పోయి తప్పించుకొని ఎగవేసేటువంటి ప్రయత్నం చేశారు. వాటిని సీరియస్‌గా పర్యవేక్షణ చేసి రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని తెలియజేస్తున్నాను.

అంతే కాకుండా Deferred VATఅని ఉంటుంది. గౌరవ ఎల్‌ఓపి గారికి తెలుసు. ఎవరికైతే concessions ఇచ్చి ఉంటామో, వారికి ఇప్పటివరకు 7 శాతం concession ఇస్తే కట్టుకునేటువంటి వెసులుబాటు ఉండేది. కొత్త రాష్ట్రం కాబట్టి ఆదాయం కావాలి. కాబట్టి మొన్న ఒక మంత్రివర్గ ఉప సంఘం వేసుకున్నాము. 7 శాతం నుండి 8 శాతానికి గనుక పెంచుకుంటే వారికి కొంత ఇన్సెంటివ్ ఇస్తే వారికి ఎంకరేజ్‌గా ఉంటుందని మొన్ననే నిర్ణయం తీసుకున్నాము. దాని ద్వారా కూడా నాలుగైదు వేల కోట్ల రూపాయలు వస్తుందనే ఆశ ఈ ప్రభుత్వానికి ఉంది.

అంతే గాకుండా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు గానీ, పన్ను ఎగవేత దారులు ఎవరైతే ఉన్నారో వారికి ఆ లీకేజీ లేకుండా మన వ్యవస్థని బలోపేతం చేసుకునేటువంటి పద్ధతి ఏదైతే ఉందో దాని విషయం ఆలోచిస్తున్నాము. మైన్స్ లాంటి విషయంలో ఎంత గొప్పగా మేము ప్రయత్నం చేస్తున్నామో చూస్తున్నారు.

కాబట్టి, ఇవన్నీ వెరసీ గొప్పగా ఆదాయం ఉండే ఆస్కారం ఉంది. కాబట్టి, ఈరోజు ఆ సంఖ్య పెట్టుకోబడిందని గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను. గత సంవత్సరం యొక్క జిఎస్‌డిపి 2011–12 constant prices ప్రకారంగా రూ.5,83,117 కోట్లు అయితే, ఈ సంవత్సరం అది రూ.6,70,585 కోట్లుగా నమోదు కాబోతున్నాయి. భారతదేశం జిఎస్‌డిపి కంటే కూడా తెలంగాణ రాష్ట్రం జిఎస్‌డిపి చాలా ముందున్నదనే విషయాన్ని సభ్యులకి తెలియజేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం వారు చాలా గొప్పగా స్టడీ చేసి రెండు క్యాటగిరీలుగా విభజించారు. అందులో ఒకటి–బాగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు. రెండవది – అభివృద్ధికి నోచుకోని రాష్ట్రాలుగా విడదీశారు.

అందులో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలను గుర్తించింది. Revenue surplus ఉన్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం incentive ఇవ్వదు. కాబట్టి, 3శాతంగా ఉన్నటువంటి FRBM loansని 3.5శాతానికి తెచ్చుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం సూచన చేసి ఉన్నది. కేంద్ర క్యాబినెట్ కూడా దీనిమీద నిర్ణయం తీసుకునేదుండే కానీ ఎందుకో తాత్సారం జరుగుతుంది. దాని వల్ల ఈ సంవత్సరానికి అది రాకపోవచ్చు. దాని మీద మొన్ననే కేంద్ర ఆర్థిక శాఖామాత్యులను కలిసి వచ్చాను. గౌరవ ముఖ్యమంత్రి గారు నీతి ఆయోగ్‌లో, ప్రధానమంత్రి గారిని కలిసిన సందర్భంలో, ఆర్థికమంత్రి గారిని కలిసిన సందర్భంలో అరడజను సార్లు రిక్వెస్ట్ చేయడం జరిగింది. "అయ్యా, అమ్మ పెట్టదు-అడుక్క తిననీయదనే" చందంగా ఉంది అని నేను కూడా 10 సార్లు రిక్వెస్ట్ చేయడం జరిగింది.

కొత్త రాష్ట్రం కాబట్టి ప్రజలకు అనేక రకాలుగా ఆశలుంటాయి. కాబట్టి వాటిని నెరవేర్చే బాధ్యత మామీద ఉంటుందని వారికి గానీ, మాకు గానీ సహాయం చేస్తారని ఆశించాము. అదీ లేదూ, ఇదీ లేదూ చివరికీ అప్పు కూడా తెచ్చుకునే పరిస్థితి రానివ్వద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఆ 3.5 శాతం వస్తుందనే ఆశతో ఈరోజు ఈ లెక్కలు పెట్టుకున్నామని గౌరవ సభ్యులందరికీ మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, మొదటి సంవత్సరంలోగానీ, రెండవ సంవత్సరంలోగానీ, ఈ సంవత్సరంలో గానీ చూస్తే, మొదటి సంవత్సరంలో కొంత ambitiousగా పెట్టుకున్నాము. రెండవ సంవత్సరంలో రూ.13,500కోట్లు పెట్టుకున్నాము. కొంత విలువైన భూములు అమ్ముకుంటే వాటి ద్వారా కొంత పేదల సంక్షేమానికి పనికివస్తుందని మేము పెట్టుకున్న మాట వాస్తవం. కానీ, అనుకున్న ప్రకారంగా రాలేదు. మొట్టమొదటిసారిగా ఈ రాష్ట్రంలో 1,25,000 మందికి గతంలో గుడిసెలు వేసుకున్న వాళ్లు కావచ్చు, మురికి కాలువల్లో రేకుల షెడ్లు వేసుకున్న వాళ్లు కావచ్చు వారందరికీ ఉచితంగానే ఇండ్ల జాగాల పట్టాలిచ్చిన మాట గౌరవ సభ్యులందరికీ తెలుసు. అట్లనే కొంతమందికి రెగ్యులరైజేషన్ చేయడం ద్వారా కొంత ఆదాయం వచ్చిన మాట వాస్తవం. కొంత భూమి అరబిందో లాంటి కంపెనీలకు, ఇతరత్రా కంపెనీలకు అమ్మడం జరిగింది.

అరబిందో లాంటి కంపెనీలకైతే రూ.29 కోట్లకు ఒక ఎకరం ఇచ్చాము. ప్రభుత్వ భూమి అయినంత మాత్రానా అగ్గువ, సగ్గువ అమ్ముకునే ప్రయత్నం చేయవద్దు. కొంత భూమి వచ్చి, మంచి రేటు వచ్చినప్పుడు అమ్ముకోవాలనే సంకల్పంతోటి ఈరోజు భూముల అమ్మకం కూడా వేగవంతం చేయలేదు. కానీ, ఇప్పుడిప్పుడే కొంత పాజిటివ్‌గా ఉంది. కాబట్టి, తప్పకుండా వాటి ద్వారా కొంత ఆదాయం వస్తుందని విశ్వాసం ఉంది. గతంలో ప్రభుత్వ పరమైన భూముల విషయంలో హైకోర్టులోగానీ, సుప్రీంకోర్టులోగానీ, మన participation, arguments సరిగ్గా లేకపోవడం వల్ల వేల కోట్ల రూపాయల భూముల్ని కోల్పోయిన సందర్భం మనందరికీ తెలుసు. గతంలో ప్రభుత్వమనగానే పైరవీ చేసుకోవచ్చు, ప్రభుత్వమనగానే ఏదైనా చేసుకోవచ్చనే భావన ఉండేది. మొన్నటికి, మొన్న మొదటిసారి వేల కోట్ల రూపాయల విలువ చేసే 380ఎకరాల భూమిని సుప్రీంకోర్టులో argument చేసి, ముక్కుపిండి దాన్ని సాధించుకున్న విషయాన్ని మనం మరచిపోవద్దని ఈసందర్భంగా మనవి చేస్తున్నాను.

అట్లా ప్రభుత్వ పరమైన భూములు ఎవరైతే బ్రోకర్లు ఆక్రమించుకున్నారో, రియల్ ఎస్టేట్ మాఫియాలు ఆక్రమించుకున్నారో అలాంటి వాటిని సాధించుకోవడం జరిగింది. ఎక్కడెక్కడైతే కొన్ని ముఖ్యమైన భూములున్నాయో వాటిని అమ్ముకొని, కొంత ఆదాయం సంపాదించుకోవచ్చనే పద్ధతితో చేస్తున్నాము. ఇవన్నీ కలగలిపి ఖచ్చితంగా సాధించుకుంటాము. 2014-15లో 61 శాతానికి వచ్చాము. 2015-16లో 82 శాతానికి వచ్చాము. తప్పకుండా 2016-17లో 90 నుండి 95 శాతానికి వచ్చి రికార్డు బద్దలు కొట్టేట్లుగా తెలంగాణ ప్రభుత్వం భావిస్తుందని తెలియజేస్తున్నాను.

గతంలో 2006-07 మరియు 2007-08 కాలంలో రూ.12,000 కోట్ల ప్రభుత్వ భూముల్ని అమ్మడం జరిగింది. 2014-15, 2015-16లో వరుస కరువులు వచ్చాయి.

నాకు తెలిసి నా చిన్నతనం నుండి ఇంత భయంకరమైన కరవును ఎప్పుడూ చూడలేదు. ఉత్తర తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లోని బోర్లలో, బావుల్లో నీరుండేటువంటి ఆస్కారం ఉండేది. ఇప్పుడెందుకో డ్రాస్టిక్‌గా గ్రౌండు వాటర్ పడిపోయింది. 2.5శాతం ఉన్నటువంటి అగ్రికల్చరల్ గ్రోత్ కరవు వల్ల అది తిరోగమనంలో ఉండి 0.8 శాతానికి పడిపోయింది. ఎల్‌నినో ప్రభావం అయిపోయిందని శాస్త్రజ్ఞులు అంటున్నారు. వచ్చే సంవత్సరం మంచి వర్షాలు గనుక పడి ఉంటే మీకు తెలుసు వ్యవసాయ కాంట్రిబ్యూషన్ జీఎస్‌డిపికి 16 శాతమే కావచ్చు, 17 శాతమే కావచ్చు. కానీ ఆ 16 శాతం,17 శాతం కాంట్రిబ్యూషన్ చేసేటువంటి ప్రజల సంఖ్య దాదాపు రెండు కోట్ల పైచిలుకు పోయేటువంటి ఆస్కారం ఉంది. మనం ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా 60, 65 శాతం ప్రజానీకం అంతా కూడా గ్రామాల్లోనే నివసిస్తారు.

వారందరు భూమి ఉన్నవాళ్లు కావచ్చు, భూమి మీద ఆధారపడి బ్రతికే వారు కావచ్చు వారందరికి వ్యవసాయం inter link అయి ఉంటుంది. కాబట్టి, వచ్చే సంవత్సరం మంచి వర్షాలు పడి వ్యవసాయ గ్రోత్ రేటు పెరిగి జీఎస్‌డిపి మరింత పెరిగి మనకు కొంత లాభం జరిగే ఆస్కారం ఉన్నట్లుగా మేము భావిస్తున్నాము.

సంక్షేమ విషయంలో అంకెలు పెట్టారు. సరే ఖర్చు కాలేదు. మీరేమో ప్రతి మాటలో, ప్రతి అంకెలో, ప్రతి నిత్యం, ప్రతి సమీక్షలో గౌరవ ముఖ్యమంత్రి గారు మాది సంక్షేమ ప్రభుత్వమని మీరు అంటున్నారు. మరి ఎందుకు ఆశించిన స్థాయిలో ఖర్చు చేయలేదనేది వారి argument. అధ్యక్షా, తమరిని గమనించమని, పరిశీలించమని వేడుకుంటున్నాను. 2010–11సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ వాటా–రూ.2,518కోట్లు మాత్రమే. 2011–12వ సంవత్సరంలో– రూ.3,221కోట్లు మాత్రమే. 2012–13వ సంవత్సరంలో– రూ.4,050కోట్లు మాత్రమే. 2013–14వ సంవత్సరంలో– రూ.4,091కోట్లు మాత్రమే. 2014–15వ సంవత్సరంలో పది నెలలకు గానూ – రూ.4,432కోట్లు. ఈరోజు 2015–16వ సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారంగా రూ.11,392కోట్లు. ఈసంవత్సరం బడ్జెట్ అంచనాలు రూ.16,169కోట్లు. 2013–14 చూసినా 2014–15 చూసినా దాదాపుగా 300 రెట్లు ఎక్కువగా ఖర్చు పెడుతున్న విషయాన్ని గౌరవ సభ్యులు గమనించాలని కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ లెక్కలన్నీ ప్రక్కకు పెడితే the simple thing, ఒకనాడు పింఛన్ల మీద ఖర్చు పెట్టిన నిధులెన్ని? సంవత్సరానికి కేవలం రూ.800కోట్లు మాత్రమే. ఈరోజు ఆ పింఛన్లు 500రెట్లు పెరిగాయి. వికలాంగుల మీద పెంచిన పింఛన్లు 300రెట్లు. బీడి కార్మికులకయితే ఆనాడు ఇవ్వలేదు. ఈరోజు అవి కూడా వెయ్యి రూపాయల చొప్పున ఇస్తున్నాము. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణలో ఇచ్చిన పింఛనుల సంఖ్య కేవలం 28లక్షలు. అది ఇవ్వాళ చూస్తే దాదాపు 35.50లక్షలు ఉన్నాయి. కాబట్టి, ఆనాడు మనం రూ.800కోట్లు ఖర్చు పెడితే, ఇవ్వాళ మనం సంక్షేమం మీద పేదల కోసం ఖర్చు పెడుతున్న నిధులు రూ.4,840కోట్లుగా అంచనా వేయడం జరిగింది. అది రూ.5000కోట్లకు పోయినా కూడా ఆశ్చర్యం లేదని గౌరవ సభ్యులకి విన్నవించుకుంటున్నాను.

అధ్యక్షా, నేను మళ్లీ, మళ్లీ చెబితే కొంత విసుగ్గా ఉంటుంది. నేను మీకు చెప్పాల్సిన అవసరం లేదు. మొన్న ప్రశ్నోత్తరాల సమయంలోనే చెప్పాను. తెలంగాణ ప్రభుత్వం డబ్బుని కేంద్ర బిందువుగా చేసుకొని ఆలోచన చేయదు. తెలంగాణ ప్రభుత్వం మనుషుల్ని, మానవత్వాన్ని, సమస్యల్ని కేంద్ర బిందువులుగా మాత్రమే ప్రణాళికలు రచించుకుంటుందనే విషయం మరచిపోకండి.

A qualitative change, ఎవరికైనా వస్తదా అధ్యక్షా? అధ్యక్షా ఎల్‌పి గారు ఆనాడు గౌరవ మంత్రివర్యులుగా ఉన్నారు. నేను ఆనాడు ఫ్లోర్ లీడర్‌గా ఉంటిని. అప్పుడు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు గౌరవ ముఖ్యమంత్రిగా ఉన్నారు. అయ్యా, మీకు మంచి పేరు వస్తుంది, అడిగిన వారికల్లా హామీలిస్తున్నట్లుగా మీకు మంచి పేరు వచ్చింది, ఈరోజు మీరు కూడా గత ప్రభుత్వం లాగా పోల్చుకునే ప్రయత్నం చేయకండి. గత సర్కార్‌కి, ఈ సర్కార్‌కి ఆస్మాన్–జమీన్ ఫరక్ ఉన్నట్లుగా ఉండాలి. ఆనాడు వాళ్లు ముఖ్యమంత్రులుగా చెప్పుకోలేదు. ఆనాడు వారు చెప్పుకున్నది Chief Executive Officer (CEO) గా చెప్పుకున్నారు. మీరు

సిఎంగా ఉన్నారు. Chief Executive Officer (CEO) అంటే డబ్బుల కోణంలోనో, నౌకర్ల కోణంలోనో, లాభ నష్టాల కొరకు పనిచేస్తారు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఆ డబ్బుల కోణంలో పనిచేయరు. ముఖ్యమంత్రి అనే వ్యక్తికి, ఆ సీటుకి కుటుంబంలో తండ్రి పాత్ర ఉంటుందని ఆనాడు నేను చెప్పాను. తండ్రి ఏం ఆలోచిస్తారు అధ్యక్షా? తండ్రి కుటుంబంలో చిన్న వాళ్లు గనుక ఉంటే, కుటుంబంలో కొంత వెనుకబడ్డ వాడు గనుక ఉంటే తల్లీ, తండ్రి వారి పక్షాన ఉంటారు. ఇవాల్టి కుటుంబాలు మనకు తెలియకపోవచ్చు గనుక, ఇవాల్టి కుటుంబంలో ఒకే కొడుకు, ఒకే బిడ్డ ఉండచ్చు గాక, కానీ ఆనాడు ఎనిమిది, పదిమంది పిల్లలున్న కాలంలో తల్లీ, తండ్రి ఎవరి పక్షాన ఉండేవారు, చిన్న కొడుకు పక్షాన ఉండేవారు. మీరు ఎప్పుడైనా చూడండి. తల్లి, తండ్రి చివర్లో ఎవరి దగ్గర ఉండేది. చిన్న కొడుకు దగ్గర ఉంటారు. పెద్ద కొడుకుకి సమాజం పరిచయం అయింది, వాడు బ్రతక గలుగుతాడు, చిన్నోడికి ఇంకా అర్థం కాలేదు, వాడికి సపోర్టు చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పి ఆ తండ్రి బీద కొడుకు పక్షాన ఉంటాడు.

నేను ఆనాడు - అయ్యా ముఖ్యమంత్రి గారూ! You are not a CEO, మీరు తండ్రిలాంటి Chief Ministerఅని చెప్పాను. చెప్పి, విశ్వవిద్యాలయం గురించి మా రంగన్నకు, పొంగులేటి సుధాకరన్నకు అందరికీ తెలుసు. అందరం హాస్టళ్లల్లో ఉన్నాము. మా అన్న మెడికల్ కాలేజి హాస్టల్‌లో ఉండేది. మెడికల్ కాలేజీ ఎంత గొప్పగా ఉండేది. ప్రతి రోజూ మటన్ ఉండకపోయేదా? ప్రతి గురువారం క్వార్టర్ చికెన్ ఉండకపోయేదా? ప్రతి ఆదివారం ఆఫ్ చికెన్ ఉండేది.

10.40 ఉ. ఆ నాడు శనివారం ఇచ్చే గుడ్డు ఎక్కడికిపోయే? ఆ నాడు మాకిచ్చే పాకెట్ మనీ ఎక్కడికిపోయే? రక్తం అమ్ముకొని, స్కాలర్‌షిప్‌లు కట్టుకొనే దౌర్భాగ్య పరిస్థితికి కారకులెవరు? ఆలోచన చేయమని చెప్పి, ఆనాడు సభలో చెప్పడం జరిగింది. అప్పుడు వారు డబ్బులెక్కడి నుండి వస్తాయని చెప్పడం జరిగింది. చట్టాలు బ్రహ్మదేవుడు రాయడు, ప్రభుత్వాలే రాస్తాయి. అవసరమైతే వందసార్లు సవరించుకోవచ్చని చెప్పి, ఆ నాటి ముఖ్యమంత్రికి చెప్పాను. చెప్పడమే కాదు, విద్యను, వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తే మనుగడ ఉండదని చెప్పి, దానికి మార్గం కూడా చెప్పడం జరిగింది. ఆ నాడు గాలి జనార్ధన్ రెడ్డి గురించి పెద్ద చర్చ జరుగుతోంది. అయ్యా, ఈ గాలి జనార్ధన్‌రెడ్డి టిఫిన్ కోసం హెలికాప్టర్‌లో పోతాడంట, బంగారు పళ్లెంలో తింటాడంట, బంగారు కుర్చీలో కూర్చుంటాడంట... అంటే ఎక్కడి నుంచి వచ్చింది, ఇదంతా మనమిచ్చిన సొమ్మే కదా! ఏం చెప్పాడు అంబేద్కర్ "సమస్త సంపద, సమస్త వనరులు సమానంగా అందరి అవసరాలకోసం ఉపయోగపడే వ్యవస్థను రాస్తున్నా" అని చెప్పి రాయడం జరిగింది.

"Development with equal distribution" అని చెప్పినటువంటి spiritని రాసిన మహనీయుడు అంబేద్కర్. దాని మీద ప్రమాణం చేసిన మనమందరం కూడా ఎక్కడనో దారితప్పినాం కాబట్టి, రక్తం అమ్ముకొని విశ్వవిద్యాలయంలో ఇవ్వాళ భోజనం ఖర్చులు కట్టుకునే దౌర్భాగ్య పరిస్థితికి కారకులెవరో తెలుసుకొని వారిని ప్రశ్నించడం జరిగింది. ఇదే ఇందిరా పార్కు దగ్గర, వందల టెంట్ల క్రింద, అనేక సమస్యల పట్ల వాళ్ల గొంతులో గొంతుకైనాం కాబట్టి, ఆ సమస్యను ప్రస్తావించిన వాళ్లం కాబట్టి ఎవరు కోరకుండానే, ఎవరు ఉద్యమించకుండానే ఆ సమస్యను పరిష్కారం చేయాలనే సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రిగారికి చెప్పడం జరిగింది. ఇవ్వాళ సన్నబియ్యం ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అధ్యక్షా. నేను హాస్టల్ బిడ్డని, ఇక్కడ చాలామంది హాస్టల్లో ఉండొచ్చు. బియ్యంలో తెల్లపురుగులు ఏరేసుకొని, రాళ్లు ఏరేసుకొని ఆ రాళ్ల బువ్వ, పురుగుల బువ్వ కూడా, కటోరంతో కొలిచిపెట్టినప్పుడు, అది సరిపోక, మా ముఖాలలో తేజం లేక, మా కళ్లల్లో జీవం లేక, మా పెదవులు పగిలినప్పుడు మేము పడ్డ నరకం ఇవ్వాళ మా బిడ్డలకు రావొద్దు. ఏ సమాజమైతే ఇవ్వాళ అట్టడుగు వర్గాల కోసం ఆలోచిస్తుందో, ఈ సమాజం బాగుండాలని చెప్పి నమ్మిన వాళ్లం. కాబట్టి ఈ తెలంగాణ రాష్ట్రంలో బంగారు తెలంగాణ రావాలంటే ఆ పిల్లల భవిష్యత్తు బాగుపడకపోతే, ఈ రాష్ట్రం బాగుపడదని, ఎన్ని వందల కోట్లైన పరవాలేదని, ఏడు వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, 2 లక్షల టన్నుల సన్నబియ్యం తీసుకురావడం జరిగింది.

ఇది సంక్షేమం కాదాఅని అడుగుతున్నాను అధ్యక్షా? మొన్ననే చెప్పినా, వచ్చే సంవత్సరం 100 శాతం ఇంటర్ మీడియట్ కాలేజీలకు, డిగ్రీ కాలేజీలకు, విశ్వ విద్యాలయాలకు వచ్చే అకాడమిక్ సంవత్సరానికి తప్పకుండా అమలుచేసి, మీ గౌరవాన్ని నిలబెడతావుని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాగే పేదలకిచ్చే బియ్యం చిన్నగానే కనపడవచ్చు. నేను అనుకున్న "చాయ్ వాలా ప్రధానమంత్రి". ఆకలి ఉన్న వాడికే అధికారమొస్తే, దుఃఖం ఉన్న వాడికే అధికారం వస్తే, ఈ దుఃఖానికి పరిష్కారం దొరకాలి. ఈ ఆకలికి అర్థం కనిపెట్టాలి. కానీ బాధనిపించిన అంశం ఏమిటంటే, ఈ ఆకలికి పరిష్కారం చూపెట్టకపోగా, ఈ దుఃఖానికి పరిష్కారం చూపించకపోగా, సంక్షేమ రంగానికి కోత పెట్టిండ్రు. Food Security Act లో భాగంగా 2015 అక్టోబర్ నుంచి మనం అమలు చేయడం జరిగింది. గతంలో ఎంతమందికైతే కార్డులున్నాయెూ, బియ్యమిచ్చేదో అంతమందికి కేంద్రం మనకు బియ్యమిచ్చేది. కానీ ఇవ్వాల ఏదో లెక్కలని చెప్పి, below poverty line families జనాభా అని చెప్పి కేవలం 1.91కోట్ల ప్రజలకు మాత్రమే కిలో బియ్యం 3 రూపాయల చొప్పున 5 కిలోల బియ్యం ఇస్తున్నది. అయిన వెరవకుండా, జంకకుండా, పేదల సంక్షేమాన్ని మరువకుండా 2.81కోట్ల మంది పేదలకు బియ్యం 5 కిలోలకు బదులు 6 కిలోలు అలాగే 3 రూపాయలకు బదులు రూపాయి చొప్పున ఇవ్వాళ రూ.3,000కోట్ల రూపాయలుండగా, అందరికి అండగా సంక్షేమ రంగానికి ఖర్చు పెట్టిన రాష్ట్రమిదే కదా అధ్యక్షా!

ఈ సంక్షేమ రంగానికి తక్కువని చెప్పి మీరు ప్రస్తావించడం జరిగింది. దయచేసి ఆలోచించుకోమని చెబుతున్నాను. మీరు ఇస్తున్న మాట వాస్తవమే, ఇంకొంచెమివ్వండని అడగండి. సంతోషపడతాం, కానీ సంక్షేమ రంగంలో ఖర్చుపెట్టట్లేదంటే ఇది సంక్షేమ దేశం. మా ముఖ్యమంత్రి ఒక మాట అంటాడు. "రాజేందర్, ఇట్లాంటి వాటి గురించి ఆలోచన చెయ్యి, అమలు చేసే ప్రయత్నం చెయ్యి, డబ్బుగురించి ఆలోచించకు" అని మా ముఖ్యమంత్రి అంటాడు. ఇవ్వాళ స్త్రీలు అనీమియాతోటి బాధపడుతారు. ఎన్నిచ్చారు అధ్యక్షా? ప్రతి నెల పిల్లలకు 16 గుడ్లు, కానీ ఇవ్వాళ ప్రతి నెల 30 గుడ్లు ఇవ్వడం జరుగుతుంది. చిన్న పిల్లలకు ప్రతి నెల 8 గుడ్లు, కానీ ఇవ్వాళ ప్రతి నెల 16 గుడ్లు ఇవ్వడం జరుగుతుంది. ఒకవైపు 17,800కోట్ల రూపాయలు ఆ నాడు కేంద్ర ప్రభుత్వం అంగన్ వాడీ కోసం ఖర్చు పెడితే, అందులో 8,000కోట్ల రూపాయలు తగ్గించుకున్నా కూడా రెట్టింపు చేసిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం.

అందుకనే this is the state of welfare state. ఇవ్వాళ ఆకలి ఉన్న వాడికి అన్నం పెట్టాలి. ఆపదలో ఉన్న వాడిని ఆదుకోవాలి. దీనికి పరిష్కారం కావాలని ఆ తదుపరి కోరుకుంటున్నాం. ఇప్పుడున్న సంవత్సరం అమలు చేస్తాం, కానీ అంతిమంగా వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడి, బ్రతకగలిగే సత్తాను మన తెలంగాణ రాష్ట్రం అందివ్వాలి. అందుకనే ఈ సంక్షేమ రంగం విషయంలో చెప్పుకుంటూ పోతే 216 పథకాలున్నాయి.

ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత, 20 నెలల కాలంలో వివిధ అంశాల మీద నిర్ణయాలు తీసుకొని, అమలు చేస్తున్న కార్యక్రమం మంత్రులకు ఇవ్వాళ ఊహకందనటువంటి విషయం. ఇవాళ కారు డ్రైవర్, ఆటో డ్రైవర్, బస్సు డ్రైవర్ బయటికెళ్లినప్పుడు భార్యతో చెప్పి పోతాడు. క్షేమంగా రమ్మని ఆ భార్య ఆశీర్వదిస్తుంది. కానీ ఇవ్వాళ మనం రక్తం ఓడుతున్న రహదారులని చూస్తున్నాం. రక్తం చిందని రహదారి ఉండదు.

డ్రైవర్లుగా అనేక మంది అసువులు బాసినప్పుడు, ఆ శవం మీద పడి ఏడ్చినప్పుడు, మనలాంటి వాళ్లం కంటి తుడుపుగా సానుభూతిగా చెబుతాం తప్ప, ఆ కుటుంబాన్ని ఆదుకునేది ఎవరు? ఆ క్షణంలో అందరి సానుభూతి ఉన్నది కావొచ్చు, కానీ దాని తర్వాత ఆ కుటుంబం అంధకారంలో మునిగిపోతుంది అధ్యక్షా. అలాంటి అంధకారంలో మునిగినటువంటి ఆ డ్రైవర్లకోసం, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. అధ్యక్షా, తమరికి తెలుసు భవన నిర్మాణ రంగంలో కొన్ని లక్షలాది మంది పని చేస్తారు. కరెంటు షాక్‌తో చనిపోయిందని, బిల్డింగ్ పై నుండి పడి చనిపోయిందని,

కూలీ చనిపోయిండని, ఆ శవమేసుకొని ఆయనకు దండాలు పెడతాం. ఆ కుటుంబానికి లక్షఇవ్వండి, రెండు లక్షలివ్వండని బేరం పెడతాం. కానీ ఆ దిక్కుమాలిన కల్చర్ ఉండొద్దని, ఆ దౌర్భాగ్య పరిస్థితి రావొద్దని వాళ్ల కోసం కూడా రూ.5 లక్షల బీమా పథకం అమలుచేసింది ఈ రాష్ట్ర ప్రభుత్వం. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ గడ్డ మీద ఉన్న ప్రతి బిడ్డ గురించి ఆలోచన చేసింది. రెండవది, కరెంటు విషయంలో పవర్ మినిస్టర్‌గా షబ్బీర్ భాయ్ చూశారు, అందరికి జల్దీ అర్థం కాకపోవచ్చుగాని, మా అన్నకు అర్థమవుతది. ఎందుకంటే, వారి హయాంలోనే రాజశేఖర్ రెడ్డి గారు అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భూపాలపల్లిలో శంఖుస్థాపన చేయడం జరిగింది.

అన్నా, మీకు తెలుసు, ఏ రాష్ట్రంలో అయితే కరెంటు ఎక్కువగా ఉంటుందో, ఆ రాష్ట్రం అభివృద్ధికి చిహ్నం. ఆ నాడు ఉమ్మడి రాష్ట్రంలో దౌర్భాగ్యమేందంటే, వ్యవసాయనికే ఎక్కువగా వాడుకునేది. కాబట్టి మనం నెగెటివ్ ఇండికేటర్‌గా భావించాం. కానీ డెవలప్‌మెంట్‌లో ఒక ఇండికేటర్, తమరికి తెలుసు యుపిఏ గురించి ప్రస్తావించారు. యుపిఏ సర్కారు వచ్చిన తర్వాత 45,000 మెగావాట్ల పవర్ ఉత్పత్తి చేయగలిగి, తమిళనాడులో ఉన్నటువంటి అంధకార రాష్ట్రానికి, మహారాష్ట్ర లాంటి రాష్ట్రానికి, అందులో భాగంగా ఈ రాష్ట్రానికి కూడా పరిష్కారం కనుగొన్నామన్నారు. అది కొంతమేరకు నిజం కావచ్చు. మీరు పెట్టిన భూపాలపల్లి ఇవ్వాళ వచ్చింది. కానీ, ఈ రాష్ట్రంలో రాష్ట్రం విడిపోయే నాటికి మా రంగన్న వాళ్ల మిత్రుడు కిరణ్ కుమార్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. మా అన్నకు నేను మిత్రున్ని.

అయ్యా, మీరు ఆలోచిస్తున్నారా! "నీరు పల్లమెరుగు నిజం దేవుడెరుగు "నీళ్లన్ని అటే పోతాయికదా! ఎట్లా వస్తాయి రాజేందర్? ఉద్యమాలకోసం మస్తు మాట్లాడండి. ఇక్కడైనా వాస్తవాలు చెప్పండి, అని చెప్పిన ముఖ్యమంత్రిగారు కిరణ్‌కుమార్ రెడ్డిగారు ఏమన్నరు వారు, "మీ రాష్ట్రం ఏర్పడితే, మీ దగ్గర జనరేషన్ స్టేషన్స్ ఉన్నయా? కరెంటు ఇవ్వాళ మీ దగ్గరే 53 శాతం వినియోగమువుతుంది. మరి మీకు సత్తా ఉన్నదా? ఎట్లా వస్తది? ఎందుకింత అనాలోచితంగా మొండిగా కొట్లాడుతున్నారు? ఆలోచన చేయమని" చెప్పి వారు చెప్పడం జరిగింది. అయ్యా! ఆనాడు ఇదే హైదరాబాద్‌లో ఎక్కడంటే, ఇందిరాపార్కు దగ్గర కార్మికులు సమ్మె చేయగా చూశాం, పొట్టకూటి కోసం టెంట్లు వేయగా చూశాం, కానీ పారిశ్రామికవర్గాలు ఏ సమ్మెలను నిషేధిస్తారో, ఏ ఉద్యమాన్ని అసహ్యించుకుంటారో, అలాంటి కంపెనీ యాజమాన్యాలే, దర్నాలు చేసి, కరెంటివ్వండి, ఎంత డబ్బైనా ఇస్తామని చెప్పిన మాట వాస్తవం కాదా ఈ గడ్డమీదఅని నేను అడుగుతున్నాను అధ్యక్షా!

కార్మికులు కొట్లాడారు. అరె! మీరెందుకు కొట్లాడుతున్నారంటే, కంపెనీ బందైతే కంపెనీ యజమానే నష్టపోతారనుకుంటున్నారు మీరు. కంపెనీ యజమాని నష్టపోయేది రూపాయైతే, అన్నం దొరకకుండా అలమటించేది, లక్షలాది మంది కార్మికవర్గమయ్యా! మీరు ఆలోచన చేస్తలేరు. ఆదివారం బందు, శనివారం బందు, శుక్రవారం కూడా బందు పెడతారా? ఇదెక్కడి న్యాయమని చెప్పి, వాళ్ల టెంటు పేశారు. ఎంత గమ్మతైన వ్యవస్థంటే, యజమాన్యాలు, కార్మిక వర్గాలు పరస్పరం విరుద్ధమైనటువంటివి. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కలిగిన వారు కూడా, ఒకే దగ్గర సమ్మె చేసినటువంటి రాష్ట్రం ఆ నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. కానీ ఈ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అంధకారం రాలే! వెలుగొచ్చింది. చీకటి రాలే! కరెంటొచ్చింది. గ్రామీణ ప్రాంతాలలోని ఊర్లోకి పోయినప్పుడు, "ఏమయ్యా ఈటల రాజేందర్‌గారూ, బాగా కొట్లాడుతవు, ఇదెందుకో మాట్లాడుతలేవు, రా అని చెప్పి, చిన్న పిల్లలని వేప, చింతచెట్ల కొమ్మలకు ఉయ్యాల కట్టి, ఇగో మా పిల్లలని విసనకర్రతో ఊపుకుంటున్నామయ్యా! వరి పొలంకాడికి పోతే వొళ్లంతా దోమలు కుడుతున్నాయి. కరెంటేసుకుందామంటే కరెంటు లేదు, ఒక గంట ఇప్పించండి.

చివరికి మనిషిచచ్చిపోతే చేదబావులు లేవయ్యా! ఊర్లలో బోర్లే ఉన్నాయి. "అయ్యా ఎ.ఇ.గారూ మా ఊర్లో మనిషి చచ్చిపోయిండు ఒక గంట కరెంటివ్వండి," అని అడగడం ఆనాటి దౌర్భాగ్య పరిస్థితి. ఇవ్వాళ కంటిరెప్ప పాటు కూడా కరెంటు పోకుండా 6 నెలల కాలంలోనే వెలుతురు నింపిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని చెప్పి, మనవి చేస్తున్నాను. ఇవ్వాళ

రైతాంగానికి 7 గంటల కరెంటొస్తోంది. 9 గంటల కరెంటివ్వాలి. వచ్చే ఏప్రిల్ నుంచి వందశాతం ఇస్తామని ప్రకటించినాం. కానీ ఒక్కటి మాత్రం సత్యమేందంటే, మీ అంతరాత్మకు తెలుసు, వీళ్లు మొండోళ్లు.

చెప్పిన మాట జవదాటరు వీళ్లు. అమలు చేస్తారనే విశ్వాసం మాత్రం ప్రజలకు ఉంది. దానికి ధన్యవాదాలు. తప్పకుండా దానిని నిలుపుకుంటాం, మీ ఆదరాభిమానాలు పొందుతాం. కరెంటు విషయంలో, మీతోటే శభాష్ అనిపించుకుంటాం, అని చెప్పి మనవి చేస్తున్నాను. అధ్యక్షా, ఇవ్వాళ ముఖ్యమంత్రిగారు చెప్పారు, మేము కూడా చెప్పాం ఇవ్వాళ ఉన్న కరెంటెంతో మీకు తెలుసు యాదాద్రి పవర్ స్టేషన్ ఎవరు పెడుతున్నారు, జెన్‌కో ఎవరు ఏర్పాటు చేస్తోంది వారు చెప్పాలి. జెన్‌కోకి ప్రభుత్వ పరమైన గ్యారంటీ అక్కరలేదు. జెన్‌కో తన సొంత రిసోర్సెస్‌లో వాళ్ల డబ్బులు తెచ్చుకోగలుగుతారు, పెట్టుకోగలుగుతారు. అది 6,000 మెగావాట్లు. యన్‌టిపిసికి మనం పెట్టాల్సిన అవసరం లేదు, వాళ్లే డబ్బులు పెట్టుబడి పెడతారు, అమ్ముకుంటారు.

మీరు నాయకత్వం వహించినటువంటి కోల్ మైన్స్ సింగరేణి. వాళ్లకు బ్రహ్మాండంగా ఆర్థిక నిలువలున్నాయి వాళ్లకు మనం గ్యారంటీ ఇవ్వాల్సిన అవసరం లేదు వాళ్ల గ్యారంటీ మీదే వాళ్ల తెచ్చుకునే ఆస్కారవుంది. అట్లా 91,500మెగావాట్ల పవర్ జనరేటర్‌లో పెట్టే పెట్టుబడికి, తెలంగాణ సర్కార్ గ్యారంటీ గాని, సపోర్ట్ గాని అక్కరలేదు. మేమే పెట్టినాం పోయిన సంవత్సరం రూ.2,000కోట్లు ఉందని చెప్పి అందాక పెట్టుకున్నాం. ఒక రూ.1,000కోట్లు ఇచ్చుకున్నాం. అవసరంపడితే రాష్ట్ర పరంగా ఇంతగొప్ప సేవలందిస్తున్న, ఇంత గొప్ప కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న ఈ డిపార్ట్‌మెంట్‌కు తప్పకుండా, ఆదుకునే దాంట్లో వాళ్లకు ఆ సపోర్ట్ ఉంటదని చెప్పి ఈ సందర్భంగా మనవి చేస్తున్నా కాబట్టి, ఆ విద్యుత్‌కు ఎక్కడా కూడ మన పరంగా డబ్బులు అక్కరలేదని చెప్పి, తమరి ద్వారా విన్నవిస్తున్నాను. వ్యవసాయ రంగం గురించి మా ఎల్‌పిగారు ఇందాక మాట్లాడుతూ మీరు ఆశించినంత ప్రయోజనం లేదని ప్రస్తావించారు. అధ్యక్షా, తమరికి తెలుసు, కరవుంది కాబట్టి దాని ఇంపాక్ట్ కనబడుట లేదని. ఖచ్చితంగా దాని ఇంపాక్ట్ కనబడుతది. ట్రాక్టర్ల మీద సగం సబ్సిడీ ఇచ్చిన సందర్భం ఎప్పుడన్నా ఉందా? అది కూడా బ్యాకెండ్ సబ్సిడీ. ఇవ్వాళ ఫ్రంట్ సబ్సిడీ పెట్టాం. ఇవ్వాళ తీసుకున్నప్పుడే మా సబ్సిడీ ఇచ్చేటటువంటి వ్యవస్థ ఎప్పుడైనా ఉందా అధ్యక్షా?

250కోట్ల రూపాయలను గ్రీన్ హౌస్ cultivation కోసం పెట్టిన చరిత్ర ఎప్పుడైనా ఉందా? ఇక్కడే ఉంది కదా! చిన్న రైతాంగానికి 100 శాతం, మధ్య తరగతి రైతాంగానికి 90 శాతం, మిగతా రైతాంగానికి 80 శాతం సబ్సిడీ ఇచ్చిన సందర్భం ఎప్పుడైనా ఉందా? అది కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమే! అధ్యక్షా, ఆనాడు ఒక్కటే హెక్టార్, ఇవ్వాళ 5 హెక్టార్లు. 5 హెక్టార్ల కంటే ఎవ్వరికి ఎక్కువ ఉండదు, కానీ 12 హెక్టార్ల వరకు ఇస్తున్నాం. ఇంకా ఒక మాట చెప్పాలి. గతంలో కిరణ్‌కుమార్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, నేను ఈ గ్రీన్ హౌస్ కోసం అర ఎకరమేంది కిరణ్‌కుమార్ రెడ్డి గారూ, నీకైతే కాళ్ల మీద నీళ్లు పడుతున్నాయి బాగానే ఉంది.

కానీ, ఈ రాయలసీమకు, తెలంగాణకు ఉదారంగా గుజరాత్ లెక్క నీళ్లు ఇవ్వరాదా? గ్రీన్‌హౌస్ కోసం అని చెప్పిన. ఎందుకిస్తమయ్యా, మీరడిగితే అసలియ్యం పో! అన్నడు. ఇవ్వాళ గ్రీన్ హౌస్ కోసం ఒక ఎకరానికి పెట్టుబడి ఎంతో తెలుసా అన్నా? 40లక్షలు ఒక ఎకరానికి, దానికి 3 ఎకరాలకు సబ్సిడి ఇచ్చే రాష్ట్రం, అంటే ఒక కోటి ఇరవై లక్షల రూపాయల్లో, కోటి రూపాయలిచ్చే రాష్ట్రం ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? అది తెలంగాణ రాష్ట్రమే అధ్యక్షా.

ఇట్లా పంట రుణాల విషయంలో మాట్లాడుతున్నారు. మీరు చేసినోళ్లు, మాకు ఆదర్శంగా ఉండాలి. Is it possible? మీరు ఆ నాడు కేంద్ర ప్రభుత్వం డా. మన్మోహన్‌సింగ్ గారి నేతృత్వంలో ప్రధాన మంత్రిగా ప్రకటించింది మాత్రం రూ.60,000కోట్లు. ఎవరికిచ్చిండ్రు? ఆ నాడు ఎవరికైతే వెళ్లదో, వ్యవసాయం సంక్షోభంలో ఉండి, దాంట్లో కట్టలేని వాళ్లకు మాత్రమే మాఫీ చేసిండ్రు. దాని తదుపరి కట్టిన 80 శాతం రైతాంగమంతా కూడా "ఇంత అన్యాయమా? కట్టడం నేరమా? రైతు రైతే కదా?" అని అంటే, రూ.5,000 చొప్పున ప్రోత్సాహకంగా మీరిచ్చిండ్రు. అంతా

కలిపితే ఎంత అధ్యక్షా? రూ.3,370కోట్లు. మనమెంతా ఇస్తున్నాం అధ్యక్షా? రూ.17,000కోట్లు.

శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్(శాసన సభ నియోజకవర్గం): అధ్యక్షా, మొత్తం భారతదేశంలో మన రాష్ట్ర ప్రభుత్వం రూ.17,000కోట్లు. దాంట్లో మన రాష్ట్రానికి రూ.13,000కోట్లు మీరు చెప్పినట్లుగానే ఏ బ్యాంకులో అయిన సక్రమంగా కట్టినవాళ్లకు రానేలేదు. సకాలంలో డబ్బులు చెల్లించని వారు ఎవరైతే ఉన్నారో వాళ్లకు వచ్చాయని, రైతులు అడిగితే అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి వాళ్లకు incentiveగా ఒక రూ.5,000 చొప్పున మొత్తం రూ.1800కోట్లు వాళ్లకు చెల్లించడం జరిగింది. అది వంద రోజులలోనే ఆ విధానాన్ని పూర్తి చేయడం జరిగింది.

**11.00 ఉ.** శ్రీ ఈటల రాజేందర్: అధ్యక్షా, అందులో తెలంగాణ వాటా రూ.3375 కోట్లు. ఎక్కువలో ఎక్కువ రూ.5000 కోట్లు ఉండవచ్చు. కానీ, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇచ్చినది రూ.17,000 కోట్లు. కొత్త రాష్ట్రం అయినప్పటికీ, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. అయినప్పటికీ మొదటి ఇన్‌స్టాల్‌మెంటు క్రింద రూ.4250 కోట్లు ఇచ్చాము కదా. తరువాత అనుకున్న ప్రకారం రెండవ ఇన్‌స్టాల్‌మెంటు కూడా ఇచ్చాము.

ఆ నాడు కూడా మేము ఇదే చెప్పాము. ఏకమొత్తంలో రుణ మాఫీ అని ఎప్పుడూ మేము చెప్పలేదు. మూడవ ఇన్‌స్టాల్‌మెంటు రేపోమాపో ఇస్తాము. నాలుగవ ఇన్‌స్టాల్‌మెంటు కూడా ఇచ్చే ప్రయత్నం చేస్తాము. రైతాంగానికి అవసరమైన రుణాలను ఇచ్చే విషయంలో కూడా తప్పకుండా ప్రయత్నం చేస్తాము. ఈ రోజు వ్యవసాయానికి రూ.4250 కోట్లు పెట్టాము. విద్యుత్తుకు ఇచ్చే నాలుగు నుండి ఐదు వేల కోట్ల రూపాయలు. ఇవి ఎక్కడికి పోతున్నాయి? వ్యవసాయ రంగానికే. మనం కేటాయించుకున్న రూ.5900 కోట్లకు అదనంగా ఈ రూ.4250 కోట్లు, పవర్ సబ్సిడీకి పెట్టుకున్న రూ.5000 కోట్లు వ్యవసాయ రంగానికి ఖర్చుపెట్టినట్లు కాదా? ఊళ్లలో ఒక సామెత ఉంది. పరిగ ఏరుకుంటే రాదు, పంట పండితే వస్తుంది. రైతులకు కరెంటు నిరంతరాయంగా తొమ్మిది గంటలు ఇచ్చాము. రైతుల రుణ మాఫీ చేసాము. ఒకనాడు ఊళ్లలో వ్యవసాయం చేసుకునే వారికే పిల్లను ఇచ్చేవారు. ఉద్యోగాలు చేసుకునే వారికి పిల్లను ఇవ్వడానికి వెనుకాడేవారు. ఎందుకంటే నెలాఖరుకి చేతిలో డబ్బులు ఉండవు. జై జవాన్, జై కిసాన్.. ఎంత గొప్ప నినాదం అధ్యక్షా.

ఈ దేశంలో ఇద్దరే ఇద్దరు త్యాగమూర్తులు. దేశాన్ని కాపాడే సైనికుడు ఒకరైతే, మరొకడు ఈ దేశ ప్రజల కోసం, పట్టెడన్నం పెట్టడానికి రక్తాన్ని చెమటగా మార్చేటటువంటి మా రైతు. అందుకే ఆనాడు 2004లో జలయజ్ఞం మొదలుపెట్టిన నాడు రెండు సంవత్సరాలలో పూర్తి చేసే ప్రాజెక్టులను గుర్తించాము, మూడు సంవత్సరాలు పట్టే ప్రాజెక్టులను రాసుకున్నాము. అంతిమంగా ఐదేళ్లలో పూర్తికాగల ప్రాజెక్టులను కూడా రాసుకున్నాము. 2004 నుండి ఈ నాడు 2016లోకి అడుగుపెట్టాము. ఏమయినాయి ప్రాజెక్టులు? పూర్తి కాలేదు. మేము కూడా అన్నీ సకాలంలో పూర్తిచేస్తామని ఎక్కడా చెప్పడం లేదు. కాని వందకి వంద శాతం గ్రామీణ ప్రజల బతుకులు బాగుపడకుండా, ఆత్మహత్యలు ఆగవని, ఆ ఆత్మహత్యలను నివారించకుండా బంగారు తెలంగాణ రాదని, రూ. 25,000 కోట్లు బడ్జెట్‌లో పెట్టుకున్న ఏకైక రాష్ట్రం ఈ తెలంగాణ రాష్ట్రం. సాగునీటి కొరకు పెట్టే ఖర్చు వ్యవసాయం కొరకు కాదా? ఇవన్నీ లింక్ అయి ఉంటాయి.

శ్రీ ఎం. రంగారెడ్డి(శాసన సభ నియోజకవర్గం) : ఆర్థిక మంత్రిగారు విప్లవ ఉద్యమాల నుండి వచ్చినవారు. మమ్మల్ని కాదు, మొత్తం ప్రపంచాన్ని కన్విన్స్ చేయగలడు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుని రూ.35,000 కోట్లతో, పద్దెనిమిది రకాల అనుమతులు పొంది, 160 టిఎంసిల సామర్థ్యంతో మేము ప్రతిపాదిస్తే, అదే 160 టిఎంసిల సామర్థ్యంతో, మీరు రూ.90,000 కోట్లతో బడ్జెట్‌లో ప్రతిపాదించారు. నిజమా, కాదా? మంత్రిగారిని చెప్పమనండి.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్: ప్రాణహిత గురించి తరువాత మాట్లాడండి. ముందు బడ్జెట్‌పై మాట్లాడనివ్వండి. రంగారెడ్డిగారూ, దయచేసి కూర్చోండి.

శ్రీ ఈటల రాజేందర్: అధ్యక్షా, ఆ నాడు వారు పునాది వేసారు. వంద శాతం ఆ నాడు వారు తీసుకున్న నిర్ణయానికి మేము జేజేలు పలికాము. రాజశేఖర్ రెడ్డిగారు ప్రాక్టికల్‌గా పోతున్నాడు, ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తున్నాడు, మాకు కూడా కావలసింది ఇదే అని మేము అనుకున్నాము. మంచిని మంచి అంటాము, చెడుని చెడు అంటాము. మీరు కూడా మాలాగే ఉండాలి. అయితే ఆ నాటికి, ఈ నాటికీ ఉన్న తేడా ఏమిటంటే సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఈ తాత్సారం తగదు అని భావించాము. జూరాల ప్రాజెక్టుకి పునాది వేసిన నాడు, దాని అంచనా వ్యయం రూ.70 కోట్లు. కాని, actual expenditure Rs.2,000 crores.

ఇదే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఆ నాటి అంచనా వ్యయం రూ.16,200 కోట్లు. దానిని రివైజ్ చేసిన తరువాత దాని వ్యయం రూ.40,000 కోట్లుగా మారింది. అదే ప్రాజెక్టు, పది, పన్నెండు సంవత్సరాల తరువాత, ఈనాడు రూ.83,000 కోట్లకు పెరిగింది. రోజులు గడుస్తుంటే ప్రాజెక్టుల అంచనాల రేట్లు పెరుగుతాయి. ఆనాడు మొదట రూ.16,200 కోట్లు ఉన్న వ్యయం తరువాత రూ.40,000 కోట్లు అయ్యింది. కొంత ఆయకట్టు కూడా పెరిగి ఉండవచ్చు. ఆ నాడు మీరు 10, 11 TMCల నీటితో చెట్లమీద విస్తరాకులు కుట్టే ప్రయత్నం చేస్తే, అది కరెక్టు కాదు సుమా, assured water ఉండాలని చెప్పి, మల్లన్న సాగర్‌కి 50 TMCలు, మొత్తం 150 TMCల నిలువ నీటితో, నీటిలభ్యత గ్యారంటీతో కడుతున్న ప్రాజెక్టు ప్రాణహిత-చేవెళ్ల రీడిజైనింగ్ ప్రాజెక్టు అనే విషయం మరిచిపోవద్దు.

మన గౌరవనీయులు ఎం.ఎల్‌సి. నరేంద్రగారు ఉన్నారు. వారు ఆ ప్రాంత నివాసి. ఈ సభద్వారా మరొక్కసారి యావత్ తెలంగాణ ప్రాంతానికి విజ్ఞప్తి చేస్తున్నాను. మా ప్రభుత్వానికి జిల్లాల పట్ల వివక్షత ఉండదు. ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ అనే భేద భావం మాకు లేదు. తెలంగాణ గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డ మా బిడ్డగానే అనుకుంటాము. ఈ గడ్డ మీద ఏ తెలంగాణ బిడ్డ కన్నీరు పెట్టినా అది తెలంగాణ కన్నీరుగానే భావిస్తాము కాబట్టి, చేవెళ్లకు కూడా అనుకున్న ప్రకారం నీళ్లు ఇచ్చే జిమ్మేదార్ మాది అని గౌరవ ముఖ్యమంత్రిగారు ఆ సభలో చెప్పి ఉన్నారు. ఎవరికి అనుమానం అక్కర లేదు. చేవెళ్లకు వచ్చే నీటిని మీరు మధ్యలో ఆపివేసారు, మాకు నష్టం చేస్తున్నారు, కృష్ణానది నీళ్లు అంటున్నారు. అవి వస్తయో, చస్తయో అనే అపనమ్మకం అక్కరలేదు. అది చేవెళ్ల కావచ్చు, మంథని కావచ్చు, మహబూబ్ నగర్ కావచ్చు, లేదా భక్త రామదాసు ప్రాజెక్టు కావచ్చు. అన్ని పంట పొలాలకు నీళ్లిచ్చే జిమ్మేదారి తెలంగాణ ప్రభుత్వానిది. కాబట్టి వ్యవసాయం పట్ల చిన్నచూపు అనే మాట వద్దు అని మనవి చేస్తున్నాను.

ఇక తాగునీటి విషయానికి వస్తే, most of the diseases are water borne diseases only. వర్షాకాలం రాగానే, కొత్త నీళ్లు రావాలి, వాటిని గిరిజనులు తాగాలి, చచ్చిపోవాలి లేదా విషజ్వరాలకు గురికావాలి. పత్రికలు రాస్తుంటాయి, ఏమి రాష్ట్రం ఇది, ఏమి ప్రభుత్వం ఇది అని. ఆదిలాబాద్ జిల్లాలో, ఖమ్మం జిల్లాలో ఉన్న మా అడవి బిడ్డలకు మంచినీళ్లు ఇవ్వాలనే సంకల్పం ఎంత గొప్పదో అర్థం చేసుకోమని మనవి చేస్తున్నాను. గత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా CPW Schemes క్రింద డబ్బు ఖర్చుపెట్టారు. నిజామాబాద్‌కు రూ.240 కోట్లు ఆనాడు కేటాయించారు. చిత్తూరు జిల్లాకు రూ.5811 కోట్లు కేటాయించుకున్నారు. ఒక జిల్లా కోసం రూ. 5811 కోట్లు అంచనా వేసి, శాంక్షన్ కూడా చేశారు. ఒక్క జిల్లాకు నీళ్లివ్వడానికి ఆరువేల కోట్ల రూపాయలు ఖర్చయినట్లయితే, మరి పది జిల్లాలకు నీళ్లివ్వడానికి ఇరవై వేల కోట్లు, ముప్పై వేల కోట్లు ఎందుకని ప్రశ్నించడం ఏమి న్యాయం అధ్యక్షా?

CPW Schemes ఎక్కడ విజయవంతమయినాయి? SRSP ఉంది కాబట్టి అక్కడ సక్సెస్ అయింది. అక్కడ కాకుండా, ఒక టిఎంసి ఉన్నచోట అయితే సక్సెస్ అయి ఉండేదా? వేల కోట్లు ఖర్చు పెట్టినా, కళ్లముందు పైపు లైన్లు ఉన్నా, నల్లా ఉన్నా, నీళ్లు రావు. వరుసగా మూడు సంవత్సరాలు కరవు ఉన్నా, ప్రజలకు నీళ్లు అందాలి. CPW అనే పాత పద్ధతిలో కాకుండా, ఏ మండలానికి ఆ మండలం ఒకచెరువు తవ్వుకుని, నీళ్లు ఇచ్చే విధానం కాకుండా, assured water ఉండే విధంగా మేము ప్లాన్ చేయడం జరిగింది. ఇరిగేషన్ బడ్జెటులో పది శాతం తాగునీటి కొరకు

కేటాయించుకున్న సర్కార్ తెలంగాణ సర్కార్. అదే జి.ఓ.లో పదిశాతం పరిశ్రమలకు కూడా కేటాయించిన ప్రభుత్వం కూడా మాదే. అందుకనే ఈ స్కీంలు SRSP ప్రాజెక్టులో పెట్టాము. మిడ్ మానేర్‌లో, ఎల్ఎండిలో, శ్రీశైలంలో, పాలేరులో మరియు నాగార్జున సాగర్ వంటి నీటి వసతి ఉన్న ప్రాంతాలలో పెట్టాము తప్ప, మండల కేంద్రాలలో పెట్టలేదు. కరవు వచ్చినా కూడా ఇబ్బంది ఉండకూడదు. సంవత్సరం మొత్తానికి మనకు 42-43 TMCల నీటి అవసరం ఉంటుంది. వరుసగా రెండు,మూడు సంవత్సరాలు కరవు వచ్చినా నీరు కావాలి కాబట్టి, ఒక 120 TMCల నీరు అందుబాటులో ఉండే విధంగా ప్లాన్ చేయడం జరిగింది.

(అంతరాయం)

శ్రీ ఎం. రంగారెడ్డి: అధ్యక్షా, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు 50 TMCల సామర్థ్యంతో పెట్టింది కాదా? మళ్లీ కొత్త ప్రాజెక్టు ఎందుకు?

(అంతరాయం)

శ్రీ పి. మహేందర్ రెడ్డి : అధ్యక్షా, రంగారెడ్డిగారు కిరణ్‌కుమార్ రెడ్డిగారికి బాగా సన్నిహితులు. వారి ఆశీస్సులతోనే రంగారెడ్డిగారు ఎమ్మెల్సీ అయినారు. మరి ఆ రోజు తెలంగాణ గురించి మా ఎమ్మెల్యేలంతా అసెంబ్లీలో అడిగినప్పుడు, మేము తెలంగాణకు ఏమీ ఇవ్వము, నా ఇష్టం, నా జిల్లాలో ఆరువేల కోట్లు పెట్టుకుంటాను. ఏం చేసుకుంటారో చేసుకోండి అన్నప్పుడు, ఆ నాడు ఎందుకు మాట్లాడలేదో రంగారెడ్డిగారు దానికి సమాధానం చెప్పాలి.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్: అధ్యక్షా, ఆర్థిక మంత్రిగారు గొప్ప ఉద్యమ నాయకుడు. మా సభ్యులకు నేను కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. మంత్రిగారి సమాధానం పూర్తయిన తరువాత మనం క్లారిఫికేషన్స్ అడుగుదాం. మంత్రిగారు ఓపికతో జవాబు చెబుతారని మనవి చేస్తూ, ఇప్పుడు పర్సనల్‌గా అటాక్ చేసే సమయం కాదు. గతం గురించి మాట్లాడుకున్నట్లయితే ఆనాడు ఉస్మానియా జేసి విద్యార్థులు రంగారెడ్డి జిల్లాలో తెలుగు మహానాడు జరిగేటప్పుడు, విద్యార్థులు వచ్చినప్పుడు, పోలీసులతో కొట్టించిన ఘనత మీది కాదా? అందుగురించి అది, ఇది వదిలేసి, బడ్జెటు గురించి చర్చించండి.

(అంతరాయం)

శ్రీ ఈటల రాజేందర్: అధ్యక్షా, మనిషికి తాగు నీరు చాలా అవసరం. స్వాతంత్ర్యం వచ్చి అరవై సంవత్సరాలు దాటుతున్నా, ఆరోగ్యకరమైన నీరు ప్రతి మనిషికి అందుబాటులోకి రావడం లేదు. అందరూ స్వచ్ఛమైన నీటిని కొనుక్కోలేరు. చెంచుపెంటలు, గిరిజన గూడెంలు, ఆదిలాబాద్‌లో ఉండేటటువంటి వెనుకబడిన ప్రాంతాలకు మంచి నీరు ఇవ్వవలసిన అవసరం ఉంది. నూటికి నూరు శాతం ఈ సంవత్సరం 6100 గ్రామాలకు, 12 మున్సిపాలిటీలకు ఈ సంవత్సరం నీరు అందించే పథకం పూర్తి చేస్తాము.

11.20 ఉ. వచ్చే సంవత్సరం 98శాతం పూర్తి చేసుకొని, 2018 సంవత్సరానికల్లా నూటికి నూరు శాతం పూర్తి చేస్తాం. దేశంలో ఇలాంటి స్కీముని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ, ప్రతి చెంచూ, లంబాడా తండాకి ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే ఉంటుంది. ఈస్కీముని ఆదర్శంగా తీసుకొని ఉత్తరప్రదేశ్‌లో అమలు చేస్తామన్నారు, అలాగే బీహార్ ఎన్నికల సందర్భంగా నేను కూడా వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేస్తానని ఆ రాష్ట్రముఖ్యమంత్రి చెప్పారు. నిజానికి తెలంగాణ రాజకీయ వ్యవస్థకి ఎంత పరిపక్వత ఉందో, ఎంత విజన్ ఉందో, ఎంత ముందుచూపుందో, ఎంత ఖర్చు పెడుతున్నామో అర్థం చేసుకోవాలి. ఇంత దానికి ఖర్చు పెట్టలేరని మనకి మనం చిన్నబుచ్చుకోవలసిన అవసరం లేదు.

ఒకటి రెండు సంవత్సరాలు కరవు వచ్చినా మన కళ్ల ముందు నీళ్లు లేని పరిస్థితి రాదు. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రకటించినట్లుగా – నా తెలంగాణ ఆడబిడ్డ మంచినీళ్ల కోసం బిందె పట్టుకొని బజారులోకి రావద్దని, వంద ఫీట్ల నుంచి నీళ్లు తోడుకోవడానికి పేగులు నోట్లోకి వచ్చే దుస్థితి రావద్దనే లక్ష్యంతో ఈస్కీముని నూటికి నూరు శాతం అమలు చేస్తాం.

తెలంగాణ ప్రభుత్వం పనితనం గల ప్రభుత్వమా కాదా, ఇగురం గల ప్రభుత్వమా కాదా అని చెప్పడానికి మొత్తం అన్నం

చూడనక్కర్లేదు. ఒకమెతుకు చూస్తే చాలు. ఒక్క మెతుకుతో తెలిసిపోతుంది. 2004 నుంచి 2013–14 వరకు వేసిన పంచాయతీ రోడ్ల విషయం చెబుతాను, మొత్తం చెప్పను. పది సంవత్సరాల కాలంలో ఎంఆర్ఆర్ గ్రాంటు క్రింద వేసిన రోడ్లు 2383.62కిలోమీటర్లు. కానీ తెలంగాణ ప్రభుత్వం 20 నెలల కాలంలో వేసిన రోడ్లు 8138.52కిలోమీటర్లు. పది సంవత్సరాల కాలంలో రెండు వేల కిలోమీటర్లు వేస్తే, ఈ రెండు సంవత్సరాల కాలంలో ఎనిమిది వేల కిలోమీటర్లు వేసిన చరిత్ర మాకుంది. తెలంగాణాలో ఎక్కడైనా రోడ్లు లేని పరిస్థితి ఉందా? అంతకు ముందు ఆటోలలో పోతే గుంతలుండి ఇబ్బందులు పడిన పరిస్థితి ఉండేది. ఎంఆర్ఆర్ కావచ్చు, 12వ ఆర్థిక సంఘం క్రింద కావచ్చు, 13వ ఆర్థిక సంఘం కావచ్చు, మొత్తం పది సంవత్సరాల కాలంలో వేసిన రోడ్ల పొడవు కేవలం 4,000కిలోమీటర్లయితే, 9163 కిలోమీటర్లను కేవలం 20నెలల కాలంలో వేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. ఎమ్మెల్సీలను అడగండి.

మెదక్ జిల్లాలోనైతే బావుల దగ్గరికి కూడా రోడ్లు వేసుకున్నారు. యల్ఓపి గారికి తెలుసు. గతంలో నేను స్వయంగా పిల్లికూనలాగా ఆయన దగ్గరికి పోయి, ఒకరెండు కోట్లు ఇవ్వన్నా, నీకు దండం పెడతా అని అడిగాను. మీరు మాపార్టీ కాదు కదా, మా పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకి, మంత్రులకు ఇవ్వాలని చెప్పారు. మీరు కోటి రూపాయలు ఇస్తే మురిసిపోయి, ఆ కోటి రూపాయల జీ.ఓ. పట్టుకొని పదిసార్లు స్టేటుమెంట్లు ఇచ్చుకొని సంతోషపడ్డాం. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి గత అనేక సంవత్సరాలుగా తెలంగాణ కళ్లల్లో మట్టికొట్టారు కాబట్టి, సమగ్రాభివృద్ధి జరగాలంటే రోడ్ల నెట్‌వర్క్ లేకపోతే సాధ్యం కాదని యుద్ధ ప్రాతిపదికన ఇంత గొప్పగా రోడ్ల నిర్మాణం చేస్తున్న ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమేనన్న విషయం తమ అంతరాత్మకి తెలుసని మనవి చేస్తున్నాను.

ఆర్ అండ్ బిలో రెన్యువల్స్ కావచ్చు, వైడెనింగ్ కావచ్చు, బలోపేతం కావచ్చు, కొత్త రోడ్లు కావచ్చు, బ్రిడ్జీలు కావచ్చు, ఆర్వోబిలు, ఆర్‌యుబిలు కావచ్చు, సి.డి.పనులు కావచ్చు... మొత్తం కలిస్తే పది సంవత్సరాల కాలంలో రూ.7వేల కోట్లు ఖర్చు పెడితే, తెలంగాణ వచ్చిన తర్వాత ఖర్చు పెట్టిన డబ్బు రూ.6 వేల కోట్లు.

20నెలల కాలంలో రికార్డు స్థాయిలో ఖర్చు పెట్టిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. తెలంగాణాలో ఒక మాట అంటారు. గుమ్మిలో ఉన్న వడ్లు అలాగే ఉండాలి, బిడ్డలు మాత్రం దొడ్డుగా ఉండాలని. అది సాధ్యమవుతుందా? అది న్యాయమా, చెప్పండి మీరే. తెలంగాణ ప్రజా క్షేత్రంలో కన్నీళ్లు తుడవాలి, కష్టాలు ఆగిపోవాలని నిరంతరం కృషిచేస్తున్నాం. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పాడిన పాటలు.. వానమ్మా వానమ్మా వానమ్మా ఒకసారైనా వచ్చిపోమ్మా అని పాడుకున్నాం. రెండేళ్లు కరువున్నా ఆ పాట పాడుకోవద్దని చర్యలు చేపట్టాం. గోదారి గోదారి పారేటి గోదారి, చుట్టూ నీరున్నా చుక్క దొరకని ఎడారి నా తెలంగాణ అని పాడుకున్నాం. దుబాయి వలసలతో దుఃఖంలో ఉన్న మా ఆడబిడ్డల కోసం పాటలు పాడుకున్నాం. సూరత్ బతుకులు, దుబాయి బతుకులు, ముంబై బతుకుల గురించి పాటలు పాడుకున్నాం. ఆనాడు నీళ్ల గురించే పాటలు పాడుకున్నాం గానీ ఏనాడైనా సుఖం గురించి పాటల పాడుకున్నామా? పచ్చని పంట పొలాలు కేవలం సినిమాలలో మాత్రమే ఉండేవి తప్ప తెలంగాణాలో ఉండేవి కావు. అందుకే ఈనాడు మేము ఏమంటున్నామంటే – ఆ కన్నీళ్ల పాటలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి, తెలంగాణాలో కూడా సంతోషకరమైన జీవితాన్ని గడుపుతూ, అనుభవిస్తూ, మేము కూడా గొప్ప వాళ్లమే, మాకేమి కష్టం లేదు అనే రోజు రావాలంటే ఖర్చు పెట్టకపోతే సాధ్యమవుతుందా? ఆదాయం ఒకేసారి పెరుగుతుందా? రాష్ట్రాభివృద్ధి కోసం అప్పులు తెస్తుంటే – మీరెందుకు అప్పులు చేస్తున్నారు, ఎందుకు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని ప్రతిపక్షాలు అంటున్న మాట సమంజసం కాదని మాత్రమే తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఒక రిపోర్టు కూడా మీకు ఇవ్వాలి. FRBM- Fiscal Responsibility Budget Management గురించి మీకందరికీ తెలుసు. ఇది 2004 నుంచి వచ్చింది. దీని ప్రకారం మూడు శాతం అప్పు తెచ్చుకుంటున్నాం. ఎలా పడితే అలా తెచ్చుకోవడానికి వీలు లేదు. దానికి కొన్ని నార్మ్స్ ఉంటాయి. ప్రధానమైన నార్మ్స్ ఏమంటే – జియస్‌డిపిలో

మూడు శాతం మాత్రమే అప్పు తెచ్చుకునే ఆస్కారం, వీలుంటుంది. ఈ మధ్య కాలంలో - రెవెన్యూ సర్‌ప్లస్ స్టేటు కాబట్టి 3.5శాతం వరకు అప్పు తెచ్చుకోవచ్చని 14వ ఆర్థిక సంఘం చెప్పింది. రెవెన్యూ సర్‌ప్లస్‌లో లేని రాష్ట్రాలకు కేంద్రమే అసిస్టెన్స్ ఇస్తుంది, గ్రాంట్స్ ఇస్తుంది. మన రాష్ట్రం, గుజరాత్ రాష్ట్రం సర్‌ప్లస్ రాష్ట్రాలు కాబట్టి మనకి గ్రాంట్స్ రావు కాబట్టి ఆ యఫ్ఆర్‌బియం లిమిట్స్‌లో మాత్రమే అప్పులు తెచ్చుకోవాలి.

(గౌరవ డెప్యూటీ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

రెవెన్యూ సర్‌ప్లస్‌లో పది శాతం లోపు మాత్రమే మనకి ఇన్‌స్టాల్‌మెంట్స్ ఫిక్స్ అయి ఉండాలి. దాని లోపలే ఉన్నాం. యఫ్ఆర్‌బియం లిమిట్‌లో మ్యాగ్జిమమ్ లోను మనం తీసుకోవడానికి ఆస్కారం ఉన్నది 25శాతం. ఇప్పటి వరకు మనం తీసుకున్నది 16.1శాతం మాత్రమే. 2015 వరకు మనం తీసుకున్న లోను 16.1శాతం మాత్రమే. కొన్ని రాష్ట్రాల పేర్లు చదువుతాను. ఆంధ్రప్రదేశ్-20.8 శాతం, బీహార్-23.8 శాతం, ఒకటే ఒక్క రాష్ట్రం, చాలా గొప్ప రాష్ట్రం, అప్పులు తక్కువగా ఉన్న రాష్ట్రం చత్తీస్‌ఘడ్ -14.3 శాతం మాత్రమే. అలాగే గోవా-30.5 శాతం, అభివృద్ధి చెందిన హర్యాన-23 శాతంఉంది. హర్యాన రాష్ట్రం కంటే, పంజాబు రాష్ట్రం కంటె, ఇతర రాష్ట్రాల కంటే కూడా తక్కువ అప్పులు కలిగిన రాష్ట్రం ఈరోజు వరకు కూడా తెలంగాణ రాష్ట్రమే అనే విషయాన్ని మరచిపోవద్దు. స్కోపు ఉంది కాబట్టి అప్పు చేసి పప్పు కూడా తినకూడదు అన్నది కాన్సెప్ట్. కానీ మేము ఈరోజు అప్పు చేసి ఏమి చేయబోతున్నాం? వేలాది కోట్లు వైద్యం పేరుతో తగలేసి అప్పుల పాలవుతున్న గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం బాగు చేయడం కోసం అప్పు చేస్తే తప్పవుతుందా? అని అడుగుతున్నాను. గతంలో ప్రభుత్వాలు అప్పు చేసి మురికి కాలువల ప్రక్కన గుడిసెలు వేసుకొని, ప్లాస్టిక్ షీట్ల తో గుడిసెలు వేసుకున్న పేద వారికి సింగిల్ బెడ్ రూము ఇచ్చారు. ఈరోజు డబుల్ బెడ్ రూము ఇళ్లు ఇస్తామంటే తప్పవుతుందా? అప్పు చేసి ఏదో రోడ్లు వేయడం లేదు. అప్పుచేసి తాగునీళ్లు ఇస్తున్నాం, అప్పు చేసి కరెంటు ఇస్తున్నాం, అప్పు చేసి పేదలకు డబుల్ బెడ్ రూము ఇళ్లు కడుతున్నాం, సాచ్యురేషన్ మోడ్‌కి తీసుకొస్తున్నాం.

నిర్వహణకి చాలా ఖర్చు అవుతుందని చాలామంది వాదిస్తున్నారు. తాగునీటికి సంబంధించి ఒక్కొక్క ఊరికి ఐదు మోటర్లు, పది మోటర్లు పని చేస్తున్నాయో లేదో చూడండి. మేము ప్రారంభించిన స్కీము ఒకసారి అమలైతే ఐదు మోటర్లు, పది మోటర్లు నడిచే వ్యవస్థ పోతుంది. మనకి నిర్వహణ ఖర్చు తగ్గుతుంది. కేంద్ర ప్రభుత్వం నిధులు, రాష్ట్రప్రభుత్వ నిధులు, గ్రామ పంచాయతీ నిధులు, మండల పరిషత్ నిధులు, ఎసిడిపి ఫండ్స్ ఖర్చు పెడుతున్నాం కాబట్టి ఆ పరిస్థితులు లేకుండా పోతుంది. వాస్తవానికి మనం నూటికి నూరు శాతం మంచిగానే ఉన్నాం. మనకు మనమే ఏదో అప్పుల పాలవుతున్నాం, చిన్న వాళ్లం, మొత్తం కూరుకుపోతున్నాం అనే భావనలు లేకుండా win-win chances పద్ధతిలో గొప్పగా ఆలోచించి, గొప్పగా ముందుకు వెళ్లేలా మనం ప్రజలకు విశ్వాసం కల్పించాలే తప్ప, అప్పుల పాలవుతున్నావుని ప్రజలను అధైర్యపరిచే పరిస్థితి రానీయకూడదని, మనమందరమూ ఆప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇప్పటికే వాటర్‌గ్రిడ్ కోసం రూ.10వేల కోట్లకు హడ్కోతో యంఓయు కుదుర్చుకున్నాం. అలాగే నాబార్డు నుంచి రూ.2500కోట్లకు యంఓయు కుదుర్చుకున్నాం.

ఇళ్ల నిర్మాణం కోసం రూ.3374కోట్లకు యంఓయు కుదుర్చుకొని డ్రా చేసుకున్నాం. చేపడుతున్న స్కీములకు డబ్బు కొరత లేకుండా అమలు చేయబోతున్నామని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, రోడ్లు, నీళ్లు ఇవన్నీ ఒక అంశం. కానీ, తెలంగాణ ప్రభుత్వం ఇంతకు ముందు చెప్పినట్లుగా ఆనాటి ప్రభుత్వాలు డబ్బుని కేంద్ర బిందువుగా ఆలోచించాయే కానీ మనిషిని కేంద్రంగా ఆలోచించలేదు. మన పండగలను, మన భాషని, మన కల్చర్‌ని, మన సాంప్రదాయాన్ని, మన సంస్కృతిని గుర్తించిన సందర్భం ఉందా? ప్రభుత్వమంటే ప్రజల విశ్వాసాలను గుర్తించడం, ప్రజల సాంప్రదాయాలను కొనసాగించడం తప్ప ఇంకొకటి ఉండదు. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆనాడు ఎన్నిసార్లు అడిగినా గత ప్రభుత్వాలు ఒప్పులేదు కానీ, బోనాల పండగ నేడు

రాష్ట్ర పండగ, బతుకమ్మ పండగ నేడు రాష్ట్ర పండగ, సమ్మక్క సారక్క జాతర నేడు రాష్ట్ర జాతరగా నిర్వహిస్తున్నాం. క్రిస్ట్మస్, రంజాన్ పండగలను ప్రభుత్వమే నిర్వహించింది. ఈరోజు కుల, మతాలతో సంబంధం లేకుండా పండగలను, జాతరలను గౌరవించుకొని, గుర్తించుకొని, డబ్బులు ఇచ్చుకొని ప్రజల మన్ననలను పొందిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం.

గతంలో గోదావరి పుష్కరాలంటే రాజమహేంద్రవరమే కదా, కృష్ణా పుష్కరాలంటే విజయవాడే కదా. తెలంగాణ ఉద్యమం మొదలైన తర్వాత ఆనాటి ప్రభుత్వాలు గుర్తించి డబ్బులు ఇవ్వకపోతే మేమే కదా ఆనాడు సొంత డబ్బులతో ధర్మపురిలో గోదావరి పుష్కరాలు నిర్వహించుకున్నది. కానీ ఈరోజు గోదావరి పుష్కరాలను ఉత్తర తెలంగాణాలో గొప్పగా నిర్వహించి శభాష్ అనిపించుకున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం. గతంలో మనల్ని గుర్తించారా? చివరికి పి.వి. నర్సింహారావు గారిని కూడా గుర్తించలేదు, గౌరవించలేదు. కానీ ఈరోజు మనం గుర్తించి గౌరవించాం, ఆయన జయంతి ఉత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వమే నిర్వహించింది.

అధ్యక్షా, నేడు ఎంత గొప్పగా తెలంగాణ మహనీయులను మనం స్మరించుకున్నామో, గుర్తు పెట్టుకున్నామో తెలుసు. కాళోజీ పేరుతో హెల్త్ యూనివర్శిటీ పెట్టుకున్నాం, హార్టికల్చర్ యూనివర్శిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. అగ్రికల్చర్ యూనివర్శిటీకి ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు పెట్టుకున్నాం. కాళోజీ పేరుతో వరంగల్‌లో కళాక్షేత్రం ఏర్పాటు చేశాం. కొమరం భీమ్ స్మారక కేంద్రాన్ని నిర్మించుకున్నాం. బయ్యారం ఎత్తిపోతల పథకానికి భక్త రామదాసు పేరు పెట్టాం. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకి సంబంధించి పాములపర్తి దగ్గర వస్తున్న రిజర్వాయర్‌కి కొమరెల్లి మల్లన్న పేరు పెట్టుకున్నాం.

నల్గొండ జిల్లాలో నిర్మించే థర్మల్ ప్రాజెక్టుకి యాదాద్రి పేరు పెట్టుకున్నాం. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ, ఆనంద్‌లను గొప్పగా గౌరవించుకున్నాం. చివరికి మా గీతారెడ్డి గారి తల్లి ఈశ్వరీభాయి జయంతిని జరుపుకున్నాం. నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న దాశరథి జయంతిని జరుపుకున్నాం. నవాజ్ అలీ జంగ్ గారి జయంతిని జరుపుకున్నాం, తెలంగాణ సర్కారు ఆయన పుట్టిన రోజును ఇంజినీర్స్ డే గా గుర్తించింది. తెలంగాణ ప్రభుత్వానికి కేవలం ప్రభుత్వం అంటే డెవలప్‌మెంట్ అనే కోణం కాకుండా ప్రభుత్వం ప్రజల జీవితాలతో పెనవేసుకున్నది, ప్రజల జీవితాలతో మమేకమైంది, ప్రజల అడుగుల్లో అడుగు వేస్తోంది, ప్రజల కళ్లల్లో కదలాడుతున్న ప్రభుత్వం కాబట్టి ఈరోజు ఖమ్మం ఫలితం వచ్చింది, వరంగల్ ఫలితం వచ్చింది, హైదరాబాదు ఫలితం వచ్చింది. రేపు ఈ తెలంగాణ మాదే, మాదే అనే పద్ధతిలో తెలంగాణ ప్రజలున్నారు కాబట్టి దయచేసి ఆ ఒరవడిని అర్థం చేసుకొని మీరు తెలంగాణ ప్రభుత్వానికి సూచనలు ఇవ్వండి, సలహాలు ఇవ్వండి, తెలంగాణ అభివృద్ధిలో భాగం పంచుకోవాలని గౌరవ సభ్యులను కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. జై తెలంగాణ!

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ : ఛైర్మన్ గారూ, ఈరోజు తెలంగాణ ప్రభుత్వ ఫైనాన్స్ మినిష్టర్ గౌరవనీయులు ఈటల రాజేందర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు మరొకసారి తెలియజేస్తున్నాను. రాజేందర్ గారిని మేము వ్యక్తిగతంగా గౌరవిస్తాం. కారణం ఏమంటే, ఆయన పేదరికంతో హాస్టల్‌లో ఉండి చదువుకొని, విద్యార్థి దశ నుంచే ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్పులు, సన్నబియ్యం, దొడ్డుబియ్యం విషయంలో వాటన్నింటి గురించి పోరాటం చేసి చివరికి తెలంగాణ ఉద్యమంలోకి వచ్చిన వ్యక్తి. He is the voice of below poverty line people, వాళ్లగురించి పోరాటం చేశారు కాబట్టి వ్యక్తిగతంగా ఆయన్ని గౌరవిస్తాం. కానీ ఈరోజు ఆయన ఫైనాన్స్ మినిష్టర్‌గా మాట్లాడారు. ఒకవైపేమో మేము ఇప్పుడే కొత్తగా వచ్చాం, ఇది మా మూడో బడ్జెట్ అని కొన్ని సందర్భాలలో అంటున్నారు. మరొకవైపు రెవెన్యూ సర్‌ప్లస్ లేదా మరొక పాజిటివ్ ఇష్యూ ఉంటే అది మా ఘనతేనని అంటున్నారు. మేము వచ్చి రెండు సంవత్సరాలు కూడా కాలేదు, కొత్త రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని ఇబ్బందులు ఉంటాయంటారు. ఏదైనా డెవలప్‌మెంటు జరిగితే మాత్రం మావల్లే జరిగిందని అంటున్నారు. గోదావరి జలాలు తీసుకొచ్చిన ఘనత మాదే అంటున్నారు. అన్నీ ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాను.

ఇంతకు ముందు మంత్రిగారు మాట్లాడుతూ, సూటిగా సూచనలు, సలహాలు ఇవ్వమని అడిగారు. ఈరోజు ఆయన పుట్టిన రోజు కాబట్టి అబద్ధాలు చెప్పకుండా, ప్రాపగాండకి పోకుండా అన్నీ నిజాలే చెబుతారని ఆశిస్తున్నాం. 2014-15లో పది నెలల బడ్జెటు ఉండేది కాబట్టి మేము ఆ బడ్జెటులో ఖర్చు చేయలేకపోయాం, ఆవిషయంలో మేము సాధించలేకపోయాం, కేవలం 61 శాతం మాత్రమే చేయగలిగామన్నారు.

ఆరోజు మీరు ఒక లక్ష కోట్ల రూపాయల బడ్జెట్ పెట్టినపుడు ఇదే ఫ్లోర్‌లో నేను డెప్యూటీ లీడర్‌గా తమరి ముందు మాట్లాడుతున్నపుడు కూడా చెప్పాను, కావాలంటే తమరు రికార్డు చూడండి. లక్ష కోట్ల వరకు మీరు పోలేరు, అది అసాధ్యమని చెప్పాను. అదే రుజువైంది. 61 శాతం వరకే మేము ఖర్చు చేయగలిగామని మీరే ఇప్పుడు చెప్పారు. అంటే ఇంకా 31 శాతం ఖర్చు పెట్టలేదు. రూ.41,000 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. 2015-16లో రూ.1.15లక్షల కోట్లు పెట్టినపుడు కూడా మేము చెప్పాం. ఈ అంచనాలను ఒకసారి ఆలోచన చేయండి, చాలా ఎక్కువగా పెడుతున్నారు మీరు అని చెప్పాం. అయినా మీరేమన్నారంటే – కాదు, కాదు, ఇది పూర్తి బడ్జెట్ కాబట్టి తెలంగాణాలో సాధ్యమన్నారు. కానీ, మళ్లీ మీరే మొన్న ఇచ్చిన పుస్తకంలో ఇది సాధ్యం కాలేదని రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో 15 శాతం తగ్గించుకున్నారు. సాధారణంగా రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో ఒక హెడ్‌లో తగ్గితే మరొక హెడ్‌లో పెరుగుతుంది. మీరే ఒక హెడ్‌లో తగ్గించుకున్నారు. మంచి రెవెన్యూ కలెక్షన్స్ వస్తున్నాయి కాబట్టి, ఈ మూడు మాసాలలో పెరిగే అవకాశం ఉంది కాబట్టి అంచనాల ప్రకారం 82 శాతం వరకు పోతుందని మీరన్నారు. అంటే అక్కడ 15 శాతం తీసేస్తే, ఇక్కడ 18 శాతం తీసేస్తే మళ్లీ మీకు అదే 70 శాతం లోపల మీకు ఎక్స్‌పెండిచర్ కనబడుతోంది.

**11.40 ఉ.** 70 శాతం కూడా దాటడం లేదు. మొదట్లో రూ.15లక్షలకు తగ్గించారు. రూ.1,15,000కోట్ల నుండి రూ.1,00,000కోట్లకి వచ్చారు. ఇప్పుడు రూ.1,00,000కోట్లలో రూ.80వేల కోట్ల నుండి రూ.82వేల కోట్ల వరకు ఖర్చు చేయబడుతుందని మీరే అంటున్నారు. రూ.80వేల కోట్ల కంటె ఎక్కువ ఖర్చు కాదని on record మేము చెప్పిన ప్రకారమే జరుగుతుంది.

ఈ సంవత్సరం కూడా 90 శాతం ఖర్చు పెడతామని అంటున్నారు. ఈరోజు కూడా మాకున్న అనుమానంగా, మా పార్టీకున్న అనుమానంగా, మా అనుభవంతో ఉన్న అనుమానంగా మేము చెబుతున్నాను. అదే రూ.80,000 కోట్ల నుండి రూ.85,000 కోట్ల కంటే ఎక్కువగా ఖర్చు చేయలేరు. అయినా, రాష్ట్రం బాగుండాలని చెప్పి ఎక్కువగా రాష్ట్ర బడ్జెట్ పెట్టి, ఎక్కువ నిధులు తీసుకువస్తామని అంటున్నారు. ఈ విషయాన్ని మళ్లీ వచ్చే సంవత్సరం చెప్పుకోవడానికి on record ఉంటుందని మీకు చెప్పడం జరిగింది. అధ్యక్షా, దాదాపు రూ.1,30,000 కోట్లు ఈ సంవత్సరం బడ్జెట్ పెట్టారు. రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం flagship programmeగా తీసుకుంది.

అందులో భాగంగా లక్ష ఇండ్లు హైదరాబాద్‌లో నిర్మించడానికి, లక్ష ఇండ్లు మిగతా జిల్లాల్లో నిర్మించడానికి గాను రూ.13,000 కోట్లు అంచనా వేయడం జరిగింది. అలాగే రూ.40,000 కోట్లు వాటర్ గ్రిడ్‌కి అవుతాయని అంచనా వేశారు. ఈ మొత్తం చూసుకుంటే, దాదాపు రూ.53,000 కోట్లు బడ్జెట్‌లో పెట్టుకున్నా, బడ్జెట్‌లో పెట్టినట్లే. ఎందుకంటే, ఇది మా ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం అని మీరే అన్నారు.

దాదాపు రూ.67,000 కోట్లు ప్లాన్ క్రింద చూపించారు. సాధారణంగా గతంలో రెండు రాష్ట్రాలు పెట్టిన బడ్జెట్‌లో ఎప్పుడైనా ప్లాన్ బడ్జెట్, నాన్ ప్లాన్ బడ్జెట్ కంటే తక్కువగా ఉంది. ఈసారి 51 శాతం బడ్జెట్ ప్లాన్‌లో పెట్టారు. నాన్ ప్లాన్ తగ్గించారు. ఎలా చేశారనేది వచ్చే సంవత్సరం చర్చించుకుందాము.

ఇప్పుడు రెండు పడకల గదులకు కేటాయించుకున్న రూ.13,000 కోట్లు మరియు వాటర్ గ్రిడ్‌కి కేటాయించుకున్న రూ.40,000 కోట్లు ప్లాన్ బడ్జెట్‌లోనే వస్తుంది. మొత్తం రూ.53,000 కోట్లు మరియు ప్లాన్ బడ్జెట్ రూపంలో చూపించిన రూ.67,000 కోట్లు రెండూ కలిపితే

రూ.1.20 లక్షల కోట్లు ప్లాన్ బడ్జెట్ గానే వస్తుంది. నాన్ ప్లాన్ బడ్జెట్ రూ.62,000 కోట్లు అయితే, రూ.1.20 లక్షల కోట్లు ప్లాన్ బడ్జెట్ అవుతుంది. మేము లేమ్యాన్‌గా ఉన్నాము. కాబట్టి ఆ వివరాలు వివరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అలాగే రెండు పడకల గదులకు, వాటర్ గ్రిడ్‌కి మరియు విద్యుత్తు వంటి మూడు విషయాల్లో అప్పులు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతుంది. విద్యుత్ విషయాల్లో అప్పులకు వెళితే రెవెన్యూ జనరేషన్ అవుతుంది కాబట్టి తిరిగి అప్పులు చెల్లించవచ్చు. కానీ, రెండు పడకల గదులకు తీసుకున్న రూ.13,000 కోట్ల అప్పుకు ప్రిన్సిపల్ ప్లస్ ఇంట్రెస్ట్ తిరిగి చెల్లించాలి. లబ్ధిదారుల నుండి మనం ఏమీ ఆశించలేము. ఎందుకంటే వారికి ఉచితంగా ఇస్తున్నాము. వాటిని కూడా తిరిగి ఎలా ప్రభుత్వం చెల్లిస్తుందనేది తెలియజేయాలి. అలాగే వాటర్ గ్రిడ్‌కి ఖర్చు పెడుతున్న నిధుల మీద కూడా గ్రామాల నుండి పెద్ద ఆదాయం రాదు. అప్పులు తీసుకున్న రూ.53వేల కోట్లకు గాను ప్రజల నుండి తిరిగి డబ్బులు ఏమీ రావు. ఆ ఋణాలు ప్రభుత్వం తిరిగి ఎలా చెల్లిస్తుంది?

ఆ ఋణాల విషయంలో ప్రభుత్వం పన్నుల రూపంలో ప్రజలపై భారం మోపమని ప్రభుత్వం ఏమైనా హామీ ఇస్తుందా? వాటిని తిరిగి ఎలా చెల్లిస్తారనేది తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

తెలంగాణ రాష్ట్రంలో జిఎస్‌డిపి చాలా ఎక్కువగా ఉంది. హైదరాబాద్‌లో ఉన్నటువంటి జిఎస్‌డిపి మొత్తం తెలంగాణ రాష్ట్రానికి వర్తిస్తుంది. 2014 వరకు హైదరాబాద్ కాకుండా మిగతా తొమ్మిది జిల్లాలకు బిఆర్‌జిఎఫ్ ఉంది. కేంద్రంలో ప్రభుత్వం మారడంతో బిఆర్‌జిఎఫ్ నిధులు తీసేశారు. ఇంతకుముందు తెలంగాణలోని హైదరాబాద్ మినహా తొమ్మిది జిల్లాలు వెనుకబడే ఉన్నాయి. వెనుకబడి ఉన్నామని చెప్పుకుంటే తప్పేమీ లేదు. వెనుకబడి ఉన్నామంటే కేంద్ర ప్రభుత్వం కూడా మనకు నిధులు కేటాయిస్తుంది. మనది ధనిక రాష్ట్రమని నష్టపోయే బదులు....

మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్ : ఎల్ఓపి గారు మీరు క్లారిఫికేషన్స్ అడగండి. స్పీచ్ ఇచ్చినట్లు ఇస్తే మంత్రిగారు సమాధానం ఎలా ఇస్తారు?

శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్: జిఎస్‌డిపి మీద ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. ఎఫ్ఆర్‌బిఎం కంటే అదనంగా లోన్స్‌కి వెళుతున్నాము. దీని భారం ఎలా పూరిస్తారో తెలియజేయాలి. కరువు వల్ల వ్యవసాయానికి చాలా ఇబ్బంది వచ్చిందని దాంతో 0.8కు తిరోగమనం చెందిందని మీరే అంటున్నారు. కానీ, మీరిచ్చిన Socio Economic Outlookలో చూస్తే వరి గానీ, మెయిజ్ గానీ, ఇతరత్రా అన్నింటినీ 29శాతం నుండి 31శాతంగా పెరిగినట్లు చూపించారు.

ఇటువంటి కరువు పరిస్థితుల్లో రూ.500కోట్లతో రాష్ట్ర సచివాలయ భవనాలు, అసెంబ్లీ భవనాలు, కొత్త క్యాంప్ ఆఫీసులు అవసరమా? కాబట్టి వాటినన్నింటినీ పెండింగ్‌లో పెట్టి 70శాతం కరువులో ఉన్నటువంటి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాను. ఆ విషయాన్ని ప్రభుత్వ విజ్ఞతకే వదిలివేస్తున్నాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారులు రెండు సంవత్సరాల్లో భవనాలు ఖాళీ చేస్తే మనకి చాలా భవనాలు మిగిలిపోతాయి. కాబట్టి మనకు కొత్త భవనాలు వద్దు.

మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్: ఎల్ఓపి గారు క్లారిఫికేషన్స్ అడిగితే మంత్రిగారు సమాధానాలు చెబుతారు.

శ్రీ పి.మహేందర్ రెడ్డి : ఎల్ఓపి గారు మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లో ఆంధ్ర ప్రదేశ్‌వారందరూ వెళ్లిపోతారు, దాంతో ఆ భవనాలు ఖాళీ అవుతాయని అంటున్నారు. అంటే ఆంధ్రప్రదేశ్ వారు వెళ్లాలని ఆయన కోరికా? మేమేమో వారుండాలని కోరుకుంటున్నాము. తెలంగాణ రాష్ట్రం బాగుండాలి, ముందుకు పోవాలని కోరుకుంటున్నాము. దేశమంతా తెలంగాణకి రావాలని కోరుకుంటున్నాము. మీరు పోవాలని కోరుకుంటే ఎలా?

శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్ : అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కంటెన్యూగా అధికారులకు చెప్పడం జరిగితే, అధికారులందరూ majority of the officers జూన్‌లో వెళ్లిపోవాలని చూస్తున్నారు. ఆ విషయం చెప్పాను. ఈరోజు కాకున్నా, రేపైనా లేదా అక్కడా అమరావతి నిర్మాణమైనాకైనా వాళ్ల రాష్ట్రానికి వారు వెళ్లిపోతారు. కానీ, ఇక్కడనుండి వాళ్లు ఎలా నడిపించుకుంటున్నారు? అలాంటప్పుడు వారు

సెక్షన్–8 revoke చేయమని అంటున్నారు. మీరు సెక్షన్–8 revoke చేస్తారా? అది కానిపని. ఆ విషయం ఎందుకు?

ప్రభుత్వం జీఓల వెబ్‌సైట్ మూసేశారు. దయచేసి దానిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాను. ఆ వెబ్‌సైట్ ఉంటే, ఎప్పటికప్పుడూ సమాచారం తెలుసుకునే వాళ్లం. అలా కాకుండా ఇప్పుడు RTI Act క్రింద సమాచారాన్ని కోరితే, కనీసం 15రోజులనుండి నెల రోజులు పడుతుంది. అప్పటివరకు కొత్త జీఓలు వస్తాయి. అప్పటికిది పాతదయిపోతుంది. బ్లాక్‌మెయిలర్స్ ఉన్నారని, కొందరు కోర్టులకు పోతున్నారని బంద్ చేయడం జరిగిందని గౌరవ పంచాయతీరాజ్ మంత్రి గారు ఇదే సభలో చెప్పారు. అది మీకే మంచిది కాదు.

సంక్షేమ రంగం గురించి ఎక్కువ చెప్పదలచుకోలేదు. ఎస్సీ/ఎస్టీ సబ్‌ప్లాన్‌లో గానీ, బిసి మరియు మైనారిటీల ప్లాన్‌లో గానీ మిగిలినటువంటి నిధులు ఏవైతే ఉన్నాయో వాటిని carry forward చేయండి. రైతులకు ఉచితంగా ఇచ్చేటువంటి 7గంటల విద్యుత్తును తొమ్మిది గంటలకు పెంచుతామని అంటున్నారు. పెంచేటువంటి అదనపు రెండు గంటల విద్యుత్‌కి ఎన్ని వందల కోట్లు అవుతుందనే విషయాన్ని ఈ బడ్జెట్‌లో పెట్టలేదు. ఈ విషయంలో రూ.4,400 కోట్ల నుండి రూ.5,000 కోట్ల వరకు సబ్సిడీ ఇస్తున్నామని అంటున్నారు. అదేవిధంగా వంద యూనిట్ల కంటే ఎక్కువగా వాడుకునే వారిమీద మే నెల నుండి విద్యుత్ ఛార్జీలు పెంచబోతున్నారని తెలిసింది. విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే అన్ని కార్యక్రమాలు చేస్తామని అన్నారు. Fuel surcharge adjustment క్రింద రూ.3,000 కోట్లు మే, జూన్ నెల నుండి వేయబోతున్నారని తెలంగాణ రెగ్యులేటరీ ద్వారా సమాచారం వస్తుంది. అది ఎంతవరకు కరెక్ట్ అనే విషయం తెలియజేయాలి.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్: మీరు ఇంత సేపు సమయం తీసుకుంటే మంత్రి గారు సమాధానం ఎలా ఇస్తారు? పాయింట్ టు పాయింట్ అడగండి.

శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్ : అధ్యక్షా, కరీంనగర్ జిల్లాలోని గోదావరిఖని ప్రక్కకు ఉన్నటువంటి కేంద్ర ఎరువుల కర్మాగారము గురించి బడ్జెట్‌లో ప్రస్తావన రాలేదు. తెలంగాణ రాకముందు ఎన్నో అన్యాయాలు జరిగాయి, మేము రాగానే న్యాయం జరుగుతుందని అంటున్నారు. Many Large Industries కాంగ్రెస్ పార్టీలో వచ్చాయి. HMT, HAL, IDPL, ECIL, MITHANI, BDL, Ordnance Factory, NFC, BHEL లాంటివన్నీ కాంగ్రెస్ పార్టీలో వచ్చాయి. వీటన్నింటిలో లక్షలాది మందికి ఉపాధి దొరికింది. డిఫెన్స్‌లో చూస్తే, DRDL, DMRL, NGRI, IICT లాంటివన్నీ కాంగ్రెస్ పార్టీ తెచ్చింది.

(గౌరవ సభ్యులు శ్రీ బి.వెంకటేశ్వర్లు, బలసాని లక్ష్మీ నారాయణ, శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ తదితర సభ్యుల నుండి అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : కూర్చోండి, కూర్చోండి.

శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్: అధ్యక్షా, ప్రపంచంలో క్రూడ్ ఆయిల్ రేటు తగ్గిపోయింది. 2014 వరకు Crude Oil Rate 138 Dollars per barrel ఉండే, అది ఈరోజు 27 Dollars per barrel అయిపోయింది. అలా ప్రపంచ మార్కెట్‌లో ఆయిల్ రేటు తగ్గినా ధరలు దించకుండా పెంచుతున్నారు. ఇలా పెట్రోల్, డీజిల్, గ్యాస్ మీద ధరలు తగ్గించకుండా సేల్స్ ట్యాక్స్ ఇంకా పెంచారు. ఇది వాస్తవమా, కాదా అనేది గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పాలి.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : తొందరగా పూర్తి చేయండి, ఇంత సమయం తీసుకుంటే ఎలా? మీరు అర్థ గంట కంటే ఎక్కువగా తీసుకున్నారు.

(సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి నుండి అంతరాయం)

جناب محمد علی شبیر (Janab Md.Ali Shabbir): Sales Tax ریاست کا ہے، ارے تم کیوں بات کرتے بھائی؟ پھر کیوں بات کرتے؟ آپ ایک Lecturer ہیں، ایک Teacher ہیں، آپ سی ایم صاحب کے آفس میں development ہے بول رہے ہیں، yes، ہری ایم پیسے لگایا بول رہے ہیں، کرن کمار ریڈی لے کر گیا بول رہے ہیں، آپ کتنا خرچ کئے آپ Finance Minister آپ کو معلوم ہو جاتا مگر ہم روز دیکھ رہے ہیں کہ development پورا کہاں ہے، بول رہے ہیں تو گجویل، سدی پیٹ، جڑ چلہ، very good. 229 constituencies میں یہ تین میں کتنا پیسہ دے، یہاں پر کتنے دے رہے ہیں؟ وہاں بھی ان کو اتنا دو۔ ان لوگوں کو amount release کا آرڈر دے رہے ہیں وہ تھوڑا continuation کا direct ہے۔

నేను ఆ అభివృద్ధిని వ్యతిరేకించడం లేదు. అందులో 50 శాతమైనా ఇతర నియోజకవర్గాలకు నిధులు కేటాయించమని కోరుతున్నాను. గత సంవత్సరంలో ఎన్ఆర్ఐ ఫండ్ గురించి అడిగాను. ఈసారైనా బడ్జెట్‌లో పెట్టలేదు. ప్రతిరోజు విమానాశ్రయంలో చూసినట్లయితే ఐదు వందల నుండి వెయ్యి మంది లోపల ఉద్యోగాల గురించి పోతున్నారు. వారికి గతంలో న్యాక్ సెంటర్ ద్వారా శిక్షణను ఇస్తుండే వారు. అది కూడా బంద్ చేశారు. గతంలో వారికి రూ.300కోట్లు ఉండే, అది కూడా తీసేసినారు. ఈసారైనా ఎన్ఆర్ఐకి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : తొందరగా పూర్తి చేయండి.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్ : అధ్యక్షా, గతంలో ఎప్పుడూ చూసినా, బడ్జెట్‌లో పెట్టిన ఏ నిధులైనా కూడా మళ్లీ ఆర్థిక శాఖ ద్వారా ముఖ్యమంత్రి గారి అనుమతితో నిధులు విడుదల అవుతుండేవి. సాగునీటి శాఖకు రూ.35,000 కోట్లు బడ్జెట్‌లో పెట్టినప్పటికీ కూడా వాటి అనుమతుల విషయంలో మళ్లీ ఆర్థిక శాఖకు రాకుండా నేరుగా నీటిపారుదల శాఖ అధికారులే వారి హెడ్ నుండి నిధులను ఉపయోగించుకునే విధంగా అనుమతులిస్తున్నారు. ఇది చాలా ప్రమాదమని తెలియజేస్తున్నాను. అలాంటి పవర్స్ ఇవ్వడం వల్ల ఈ system break అయ్యే అవకాశముందని తెలియజేస్తున్నాను. ఈ పద్ధతి సరియైనదేనా అని ఎవరినైనా నిపుణులని అడగండి. ఈ విషయంలో నేను Comptroller and Auditor General కి లేఖ వ్రాయడం జరిగింది. దీనిని మళ్లీ ఒకసారి ఆలోచన చేయండి. ప్రభుత్వంలో ఏ నిధులు కావాలన్నా కూడా ఆర్థిక శాఖకి ఫైల్ రావాలి. మళ్లీ మీవద్ద నుండే ఫైల్ పోవాలి.

**12.00 మ.** ఇకపోతే వరల్డ్ యూనివర్సిటీ అంటున్నారు. ఉన్న 11 యూనివర్సిటీల్లో ఉప కులపతులు లేరు. 5–10 సంవత్సరాల నుండి కోర్టులో ఉన్న దానిమీద ఏమి నవరణలు తీసుకొస్తారు. దయచేసి ఉప కులపతులు లేకుంటే ఈ విద్యార్థి ఆర్గనైజేషన్‌కు ఎవరు ప్రాతినిధ్యం వహించాలి. దయచేసి ఆ ఉప కులపతులను తొందరగా నియమించాలని ముగిస్తు, మా సభ్యులు కూడా వివరణలు అడుగుతారు. మీరు రూ.1,30,000కోట్లు బడ్జెట్‌లో పెడతామంటున్నారు. అందులో ప్రణాళిక క్రింద రూ.53,000కోట్లు, ప్రణాలికేతర బడ్జెట్ క్రింద రూ.62,000కోట్లు పెట్టి చేస్తామంటున్నారు. కానీ మాకున్న ఆలోచన, అనుభవం ప్రకారం ఇది సాధ్యం కాదని తెలియజేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

SRI SYED ALTAF HYDER RAZVI (ASSEMBLY CONSTITUENCY): Sir, from my party side, I had spoken about in the Budget Speech. I will be very specific and I will not go into the many subjects. I will stick to minorities issue and five issues relating to GHMC.

Sir, in the financial year 2014-2015, a sum of Rs.1036 Crores was allocated for Minorities Welfare, out of which Rs.332 Crores was spent and Rs.704 Crores remained unspent. Similarly, in the financial year 2015-2016, a sum of Rs.1105 Crores was allocated, but only Rs.465 Crores was spent and that means, Rs.640 Crores in the last year was unspent from the Minorities Welfare Budget. This year again, Rs.1200+ Crores was allocated for Minorities Welfare in the Budget.

Sir, through you, I would like to ask the Hon'ble Finance Minister, in the last year, there are certain amounts, which are to be given under Scholarship, which are pending and apart from that, there were certain funds allocated for various Developments under the Minorities Welfare. Similarly, the funds for Scholarship of Rs.95 Crores have come from the Central Government and this has not been disbursed to the students. There are about 170000 students who are supposed to get these scholarships. In Nizamabad District alone, more than 10000 students are there. So, this scholarship amount of Rs.95 Crores needs to be disbursed to the students immediately in this year.

Sir, apart from that, a sum of Rs.63 Crores was allocated towards grant-in-aid for Wakf Board. Previously, for so many years, grant-in-aid was not given. Basically, it is given for taking-up repairs and maintenance of Mosques, Dargas, Ashoor Khanas in the State of

Telangana. Even though a sum of Rs.65 Crores was a very small amount, still, last year, one incident, I want to point out where two people died at Ashoor Khana of Hussaini Alam, the 450 years old Heritage structure collapsed after rains. This is very bad state of affairs with Telangana State Wakf Board. I would like to request the Hon'ble Minister for Finance to enhance this allocation to atleast Rs.100 Crores. This year, you have given Rs.65 Crores and that amount should be spent for development and maintenance of these religious structures.

Sir, apart from that, the Hon'ble Finance Minister has not talked about, because we have been getting lot of speculations, even media has reported, the power tariff is going to be hiked and so also the water tariff and property tax , there is a talk that it is going to be hiked. I would like to have a clarity from the Hon'ble Finance Minister on this issue.

Apart from, there is a provision made in this year's budget of Rs.4675 Crores for 'Chief Minister Special Fund'. I welcome this move, because, in emergency situations, this is a very important area, where the Hon'ble Chief Minister can immediately allocate and disburse some funds. In this fund, I would like to talk about Quli Qutub Shah Development Authority, which was specially created to cater to the needs of old city and for its development, nothing has been given except for salaries in this year's budget.

Sir, I would like to tell the Hon'ble Finance Minister through you that atleast Rs.200 Crores out of this Chief Minister Special fund be given to Quli Qutub Shah Urban Development Authority so that some developmental activities can be taken care through this particular wing of Urban Development Authority.

Sir, for Hyderabad Metropolitan Water Works & Sewerage Board, a sum of Rs.1000 Crores has been allocated in the year 2016-17. I would say, additional Rs.600 Crores be given from this, because we represented to the Hon'ble Chief Minister also that the in old city, ancient Nizam's period sewer lines are there and these lines are not working properly and there is heavy population growth. This was insufficient, so earlier, this work has been done through the projects in HMWSSB. There are certain incomplete works. If this particular amount is given, those works can be completed and infrastructure of the Department will be better.

Another very important thing, SETWIN was created for giving training and employment for minority people. This particular SETWIN was created in the year 1978. This year, budgetary allocation made for SETWIN is Rs. 11 Crores out of which, Rs. 6 Crores for salary and Rs.5 Crores for training programs & employment. In this regard, I would like to tell the Hon'ble Finance Minister through you to bring SETWIN under Minorities Welfare Department and already, the Minority Welfare Department is carrying out certain development training programmes wherein, employment generations can be created.. You have allotted Rs.12 Cores in this particular programme for training in various wings of trade in minorities welfare Department. If this amount with SETWIN, if is given under the Minorities Welfare Department, it can be very good for the people from minority community.

کی ایم صاحب اردو میں بات کرتے ۔ اردو کو promote کر رہے ہیں، اچھی بات ہے لیکن صاحب ، اردو کا آج کیا حال ہے
؟ صاحب، 10 اضلاع میں تو Centers کھولے گئے تھے، Urdu Computer Centers بھی کھولے گئے تھے، اس میں
کافی بند ہو چکے ہیں۔ صاحب، آج ضرورت ہے کہ اسے review کیا جائے۔ صاحب، review کرکے اچھے سے اچھا District
Headquarters میں جہاں جہاں پر بھی اردو میں بات کرنے کے اور اردو میں generate employment کرنے کی
ضرورت ہے وہاں پر پیسے spend کرنے کی ضرورت ہے ۔ آخر میں آپ سے یہ پوچھنا چاہوں گا کہ اس سال 1200 کروڑ کا
بجٹ دیا ہے، جو جو بھی چیزیں اس میں بتائی ہیں، اور اس سال ہم کو امید ہے کہ 1204 کروڑ اس پر تکمیل ہوگا کیونکہ کئی جگہوں پر
Minorities Welfare Department میں vacancies ہیں۔ ہم بار بار کہتے آرہے ہیں، کئی بار تلنگانہ بننے کے بعد بھی
کہہ چکے ہیں کہ جلد سے جلد جو خالی جائیدادیں ہیں ان کو fill کیجئے کیونکہ آج بجٹ دے رہے ہیں لیکن آفیسر اس کو خرچ نہیں کر پا رہے
ہیں، اس لئے میں یہ مثال دیا آپ کو۔ وقف بورڈ کے اندر 53 کروڑ 2014-15 میں دیا تھا، 12.8 crores ایک quarter میں
release ہونے کے باوجود صرف 5.57 crores spend ہوا، صاحب مطلب 5.57 crores خرچ کر سکے، اور 7.2
crores پیسے ہی account میں رہ گیا۔ صاحب تو یہ لوگ کام نہیں کر سک رہے ہیں، حکومت کی جانب سے ایک ایک کو چار چار کا
additional charges ڈال کر بٹھایا گیا ہے تو میں کہتا ہوں کہ اس میں جتنے posts خالی ہیں، اب کی ضرورت کے حساب سے
cadre strength کے حساب سے آج کے posts منظور کئے ہیں، ان کو جلد سے جلد پورا کیجئے، اور یہ پورا
specifically میرے پورے جواب Finance Minister صاحب سے جاننا چاہتا ہوں اور آپ کی آج birthday ہے، مجھے
بتایا ہے، میں آپ کو مبارکباد دیتا ہوں، at least ہم کو کیک کا پیس تو دے سکتے تھے، لیکن میں آپ کو مبارکباد دیتا ہوں صاحب۔

Thank you so much Sir.

శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి(ఉపాధ్యాయ నియోజకవర్గం-మహబూబ్ నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్) : అధ్యక్షా, రెండు విషయాలు మీ ద్వారా మంత్రిగారి దృష్టికి తీసుకొస్తాను. ఇప్పుడున్న పిఆర్‌సిలో 43 శాతం fitment వచ్చిందంటే, తెలంగాణ ఉద్యోగులే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఉద్యోగులు కూడా, గౌరవ ముఖ్యమంత్రిగారి వల్ల మరియు తెలంగాణ ప్రభుత్వం వల్ల 43 శాతం fitment వచ్చిందనే నమ్మకంతో ఉన్నారనేది తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. అధ్యక్షా, ఏనుగెల్లి తోక చిక్కినట్లుగా మా బాధ ఒకటే. మంచి పిఆర్‌సి ఇచ్చి, అమలు చేశారు. ఆ తొమ్మిది నెలల పిఆర్‌సి బకాయిలను, ఉద్యోగ సంఘాలతోటి కుదుర్చుకున్న ఒప్పందం మేరకు, జీపిఎఫ్‌లో కలిపే విధంగా, రిటైర్డ్ వాళ్లకు ఒక దఫా, రెండవ దఫాలు నగదు రూపంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మీద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. అదేవిధంగా రెండవ వివరణ – 2004 సంవత్సరం నుండి contributory pension విధానాన్ని అమలు చేస్తున్నారు. ఆ contributory pension విధానంలో ప్రభుత్వం జమ చేస్తున్న మొత్తం అమౌంటుని ఎక్కడ పెట్టుబడి పెడుతున్నారు? ఆ పెట్టుబడి లాభదాయకంగా ఉంటుందా, లేకపోతే మేము రిటైర్డ్ అయ్యేవరకు అసలు ఆ అమౌంటు మాకు వస్తుందా? రాదా? అనే ఆందోళనలో ఈ రోజు ఉద్యోగులు ఉన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో ఆ contributory pension విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విధంగా, ఆలోచన చేయాల్సిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. అదేవిధంగా హెల్త్ కార్డులు కూడా పూర్తి స్థాయిలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఈ అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

శ్రీ సభావత్ రాములు నాయక్(నామినేటెడ్) : అధ్యక్షా, ఇవ్వాళ ఈటల రాజేందర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు. 1700 మంది గిరిజన పిల్లలకు గత 3 సంవత్సరాల నుండి సబ్సిడీ రావడం లేదు. కాబట్టి బకాయి ఉన్న వంద కోట్ల రూపాయలను మంత్రి గారి జన్మదిన సందర్భంగా బహుమతిగా ఇవ్వాలని కోరుతున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి(శాసన సభ నియోజక వర్గం): అధ్యక్షా, ఖమ్మం జిల్లాలోని 7 మండలాలు దెబ్బతిన్నందువల్ల, తెలంగాణ బిడ్డగా అడుగుతున్నాను. ప్రజల మీద పన్నుల భారం మోపకుండానే, అభివృద్ధికి కావల్సిన నిధులను సమీకరించడం ఈ ప్రభుత్వ లక్ష్యం. ఈ బడ్జెట్ చర్చకు అనుగుణంగా విద్యుత్ ఛార్జీలు, ఆర్‌టిసి ఛార్జీలు, నీటి ఛార్జీలు, ప్రాపర్టీ టాక్సెస్ పెంచమని గౌరవ ఎల్‌ఓపిగారు చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ఆ అనౌన్స్ మెంటు వస్తుందని ఆశిస్తున్నాం. రూ.300 కోట్లు 45 రోజుల నుండి జీతాలు వాళ్లకు రావడం లేదు. మా ప్రాంతమైన ఖమ్మం జిల్లా, కల్లూరు ప్రాంతంలోనే చాలా ఇబ్బందులున్నాయి. ఈ మధ్య పేపర్లో, కూలికి పోయినటు వంటి ఒక తల్లి, తన బిడ్డకు ఎండ తగలొద్దని, తాను బండ మీద పడుకొని బిడ్డను ఒడిలో పడుకో బెట్టుకుంటే కనీసం టెంట్లు కూడా లేని దుర్భర పరిస్థితి అక్కడ ఉన్నది. ఈ విధంగా కూలీలను దృష్టిలో పెట్టుకొని రూ.300 కోట్లు ఉపాధి హామీ పథకం క్రింద విడుదల చేయాలని కోరుతున్నాను. అదేవిధంగా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ సహకార బ్యాంకుల రుణాలపై వడ్డీ రాయితీ రూ.294.45 లక్షలు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయి ఇస్తే రైతులకు లోన్‌లు వస్తాయి.

ఎందుకంటే 74 శాతం రైతులు అప్పుల్లో ఉన్నారు. National Sample Survey ప్రకారం దాదాపుగా 54.423 అప్పులున్నాయి. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పెద్దమనసుతో ఒకేసారి రుణమాఫీ కూడా ఇంతపెద్ద బడ్జెట్ పెట్టుకున్న నేపథ్యంలో చేస్తారని కోరుకుంటున్నాం. Special Development Fund లో మానవత స్పర్శ ఉన్నటువంటి ప్రభుత్వమని చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మేము చెప్పేటటువంటి నివేదనలోని Special Development Fund లో consider చేస్తారని కోరుతున్నాం. అదేవిధంగా ఎల్‌ఓపి గారు carry forward అని చెప్పారు.

ఇరిగేషన్‌కు రూ.25,000 కోట్లు బడ్జెట్‌లో ఖర్చుపెడతామన్నారు. దానికి సంబంధించి మానిటరింగ్ మెకానిజం తప్పనిసరిగా ఫైనాన్స్‌లో ఉండాలి. చెక్స్ అండ్ బ్యాలెన్సెస్‌లో ఉండాలి. అదేవిధంగా 9 నెలల పిఆర్‌సి

బకాయిలను దయచేసి వెంటనే ఇవ్వాలి. అలాగే భద్రాచలంలోని శ్రీరామచంద్రుడి కళ్యాణానికి గత బడ్జెట్‌లో మీరు హామీ ఇచ్చారు. గతంలో దేవుడి కళ్యాణానికి కూడా ముఖ్యమంత్రిగారు వచ్చారు. అయితే, కొద్ది రోజుల్లో భద్రాద్రిలో శ్రీరాముని కళ్యాణం జరగబోతుంది. కాబట్టి, ఆ దేవాలయం అభివృద్ధి కొరకు బడ్జెట్‌లో రూ.100 కోట్లు ఇవ్వాలని కోరుతున్నాను.

ఇవ్వాళ 231 కరువు మండలాలలో ఖమ్మం జిల్లాను కూడా కరవు ప్రాంతంగా వెల్లడించండి. మా constituency development fund కూడ తప్పనిసరిగా చేయండి. 50శాతం త్రాగునీటికి ఈ సీజన్‌లో ఉపయోగించేటట్లు, అలాగే అందరి ఎంఎల్ఏలు, ఎంఎల్సీలకు వర్తించేటట్లు చేయండి. అప్పుల విషయానికొస్తే పక్క రాష్ట్రాల్లో 16.1 శాతం మాత్రమే ఉందని అన్నారు. *No one has travelled the road of success without crossing the street of failure. God never promised us an easy journey. He only promised us a great destination.* కాబట్టి భగవంతుడి ద్వారా ఒక great destination కోరుకున్న మేము కూడా, అన్ని విధాలుగా ఉండి, మా పార్టీ కూడా తెలంగాణ ఉద్యమంలో ఉన్నప్పుడు కొంతమంది – సుధాకర్ రెడ్డి నువ్వు ఎందుకు ఎంఎల్సీకి రిజైన్ చేయాలి, ఏఐసిసి జనరల్ సెక్రటరీగా ఉండి నువ్వెందుకు నిరాహార దీక్ష చేయాలనేటువంటి అవమానాలు కూడా పొంది, మా నాయకత్వంతో కొట్లాడడం జరిగింది. ఆనాడు సోనియాగాంధీతో మాట్లాడి మన ముఖ్యమంత్రిగారు చెప్పిన నేపథ్యంలో తెలంగాణ తెచ్చుకోవడం జరిగింది. కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ తల్లిగా చరిత్రలో మిగిలిపోతారు.

మిషన్ కాకతీయకు మీ టిఆర్ఎస్ ఎంఎల్ఏ అభ్యర్థి ఇవ్వకముందు సుధాకర్ రెడ్డి అనే ఎంఎల్ఏ తన నెల జీతం మా ఊరి చెరువు అభివృద్ధికి ఇచ్చాడని చెప్పడం జరిగింది. కాబట్టి దాంట్లో ఉన్న అవకతవకలను బాగుచేయమంటున్నాం. అలాగే మిషన్ భగీరథ గురించి అంటే బ్రేక్ లేసే ఉద్దేశ్యం మాకు లేదు. గుర్రానికి కూడా కళ్లెం ఎందుకు పెడతారు అధ్యక్షా? కళ్లెం ఉండాలి, ప్రతిపక్షం అనేది constructive. 2 get and 2 give create many problems, but when it is doubled 4 get (forget) and 4 give (for give). మీరందరు ఆ దిశలో ఆలోచించి, చిత్తశుద్ధితో చేయాలని కోరుకుంటున్నాను.

ఈ రోజు ఫీజు రీ–యింబర్స్‌మెంట్‌లో రూ.5,000 కోట్లు బకాయిలున్నాయి. మా ఖమ్మం జిల్లా ఒక్క దాంట్లోనే రూ.200 కోట్లు 51,000 మంది విద్యార్థులకు ఫీజు రీ–యింబర్స్‌మెంట్ ఇవ్వాలి. అలాగే వైరా రిజర్వాయర్ వల్ల అక్కడున్న వంద గ్రామాల ప్రజలు నిజంగా బురద నీరు త్రాగుతున్నారు. మీరు కవులు, కళాకారులతోటి తెలంగాణ బతకమ్మ పండుగ చేస్తున్నారు. దానికి మేము అభినందిస్తున్నాం. ఐటిఐఆర్ ప్రస్తావన లేదు అధ్యక్షా. ఐటి మంత్రి అవార్డు తీసుకుంటే, ఈ యొక్క కాంగ్రెస్ ప్రజాప్రతినిధిగా భేషజం లేకుండా congratulations మెసేజ్ పెట్టాను కానీ, రిటర్న్ మెసేజ్ పంపియలేదు. ఆ విధంగా బరాబర్‌గా మీరు ఆ దిశలో వెళ్తారని, రైతులను, కరువు, త్రాగునీటిని దృష్టిలో పెట్టుకొని కృషిచేస్తారని చెబుతూ, మీ ద్వారా మంత్రిగారిని కోరుకుంటున్నాను.

**12.20 మ.** | శ్రీ టి.భాను ప్రసాదరావు(స్థానిక సంస్థలు–కరీంనగర్): అధ్యక్షా, భూములను అమ్మడం ద్వారా ఇంత మొత్తం వస్తుందని కొంత టార్గెట్ పెట్టుకోవడం జరిగింది. ఇటీవలనే కొన్ని విలువైన భూములను కోర్టుల ద్వారా సాధించుకోవడం అనేది ప్రశంసించదగిన విషయం. అయితే ఈ సందర్భంలో మంత్రిగారికి నా విజ్ఞప్తి ఏమిటంటే భూములను అమ్మగా మనకు ఎంతైతే రెవిన్యూ వస్తున్నదో, అందులోనుండి ఒక ఇరవై, ఇరవై ఐదు శాతాన్ని తిరిగి ఆ డబ్బును భూసేకరణ కొరకు వినియోగించి, రాబోయే తరాలకు గాని, రాబోయే ప్రభుత్వాలకు మరల ప్రభుత్వం చేతిలో కొంత Land Bank ఉండే విధంగా చర్యలు తీసుకుంటే, రేపు రాబోయే రోజుల్లో పన్నులు వేయకుండా, source of income ఉండే విధంగా ప్రభుత్వానికి ఉపయోగపడుతుంది కాబట్టి, ఈ రోజు 75 శాతం వినియోగించుకుని, రానున్న తరానికి ఒక 25 శాతం ఉపయోగపడే విధంగా land bank create చేయవలసిందిగా మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఈటల రాజేందర్: అధ్యక్షా, భాను ప్రసాదరావు గారు చాలా విలువైన సూచన చేశారు. ఏ నాటికైనా భూమి కలిగి ఉన్నవారు లాభంలో ఉంటారు, క్షేమంగా ఉంటారు. భూమి అనేది ఒక భరోసాకి చిహ్నం లాంటిది. ఆ సూచన ముఖ్యమంత్రి గారికి తెలియజేసే ప్రయత్నం చేస్తాను. రాములునాయక్ గారు అడిగిన నిధులు తప్పకుండా విడుదల చేస్తాము.

అలాగే కె. జనార్ధన్‌రెడ్డిగారు లేవనెత్తిన అంశం ఏదైతే ఉందో ఆ విషయంలో ఒక పాలసీ డెసిషన్ తీసుకోవలసి ఉంది. కాబట్టి అది ఈ సభలో నిర్ణయం తీసుకునేది కాదు. పిఆర్‌సి విషయంలో కొంత పరిష్కారం కనుగొనడానికి ప్రయత్నిస్తాము. రెండవ అంశం కంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దుకి అవకాశం లేదు.

అలాగే హెల్త్ కార్డుల విషయంలో సమస్య పరిష్కారం జరుగుతుంది. మాది Employees Friendly Government. ఉద్యోగులు, ప్రభుత్వం వేరువేరు కాదు అనే విషయం ఇంతకుముందు అనేకసార్లు చెప్పడం జరిగింది. వారు కూడా బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములే.

సుధాకర్ రెడ్డిగారు కోరినట్లు ఈ సారి భద్రాచలం దేవాలయానికి తప్పకుండా నిధులు కేటాయిస్తాము. మీ తరఫున మాట్లాడి, ముఖ్యమంత్రిగారిని ఒప్పించి, కొంత డబ్బులు వచ్చేలా చూస్తాను. ప్రభుత్వం అనేది ప్రాక్టికల్‌గా ఉండాలి, ఆదర్శవంతంగా ఉండాలి. ప్రజల్లో విశ్వాసం కల్పించాలి. మేము తప్పకుండా ఆ రకంగా పరిపాలన అందించగలమని విశ్వసిస్తున్నాను. ఏ విషయమైనా మాకు మాత్రమే తెలుసు అనే ధోరణి మా ప్రభుత్వానికి లేదు. కాంగ్రెస్ పార్టీ నలభై సంవత్సరాలు ఈ రాష్ట్రాన్ని పాలించింది. మీరు అనుభవజ్ఞులు. అనేక రకాలైన సమాచారాలు మీ దగ్గర ఉంటాయి. మీ సూచనలు, సలహాలు తప్పకుండా తీసుకుంటామని చెప్పి మనవి చేస్తున్నాను.

ఉద్యోగుల పిఆర్‌సి ఎరియర్స్ ఆర్థికపరమైన అంశం. త్వరలో దీనిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తాము. కరువు గురించి సుధాకర్ రెడ్డిగారు ప్రస్తావించారు. ఖమ్మం జిల్లాలో మంచి వర్షాలు పడ్డాయనే చెప్పుకోవచ్చు. అప్‌లాండ్ ఏరియాలో ఉన్న ఒక్క తిరుమలాయపాలెం వంటి చోట్ల సమస్య ఉండవచ్చు. ఆ ప్రాంతాన్ని కూడా ఆదుకునే ప్రయత్నం చేస్తాము. అలాగే ఉపాధి హామీ పథకం క్రింద నిధులు విడుదల కావడం లేదని చెప్పారు. మా శాఖ అధికారులతో మాట్లాడి, ఇబ్బందులు ఏవన్నా ఉంటే వాటిని పరిష్కరిస్తాను.

కొందరు సభ్యులు మాకు కూడా CDFలో భాగస్వామ్యం ఉంటుందా అని అడిగారు. అసలు ఈ ప్రభుత్వానికి ఆ వివక్ష ఉందా అని నేను అడుగుతున్నాను. నియోజక వర్గాల పట్ల మాకు వివక్ష లేదు. అన్ని నియోజక వర్గాలకు ఏ అవసరం ఉందో వాటిని ప్రభుత్వం కన్సిడర్ చేస్తుంది. ఉదాహరణకు మిషన్ కాకతీయ పథకం క్రింద అందరికీ ఇస్తున్నారు. భగీరథ పథకం రాష్ట్రం మొత్తం సమానంగా అమలు చేస్తున్నాము కదా. Roads renewal అందరికీ ఇస్తున్నాము కదా. గతంలో మాదిరిగా దరఖాస్తులు పెట్టి, దణ్ణం పెట్టే పరిస్థితి లేదిప్పుడు. ఈ ప్లాన్ అలకేషన్‌లో కవర్‌కాని విషయాలు ఏవైనా ఉండి ఉంటే, లేదా నిధులు పూర్తిగా ఖర్చయి ఉన్నట్లయితే, ముఖ్యమంత్రిగారిని కలవండి. వారు తప్పకుండా ఆమోదిస్తారని మనవి చేస్తున్నాను.

رضوی بھائی نے جو مسئلہ اٹھایا تھا، Issue اٹھایا تھا وہ صحیح ہے۔ اردو کے بارے میں Corporation یہ سب ان میں اسٹاف نہیں ہے جو اسٹاف تھا ان کو کام نہیں آتا تھا، پہلے اس کو اچھا کرنا ہماری fundamental duty ہے، اس لئے سی ایم صاحب نے 4-5 بار میٹنگ بلائی تھی، آپ کو معلوم ہے ماڈیکون صاحب جو leadership میں کمیٹی لگایا تھا، study کر کے دے رہے ہیں، ایک بات تو صحیح ہے، اس سے پہلے بات سے چلتا تھا، ابھی کام کرنے کی سرکار آئی ہے، یہ لوگ ہیں، وہ لوگ ہیں، میں کہتا ہوں اس سے پہلے Minorities Welfare میں جتنا خرچ کیا تھا، اس سے زیادہ خرچ کرنے تیار ہیں، 300 times, 400 times زیادہ خرچ کرنے کے واسطے سرکار تیار ہے۔ اس میں ایک ہزار چار خرچ کئے تھے سو کروڑ روپے allocate کئے تھے، ابھی 1200 کروڑ ضرور خرچ کرنے کا کام سرکار کرے گی، ہم کو معلوم ہے ایک ہاسٹل بھی نہیں لگائے تھے، ایک girls کے لئے ہاسٹل نہیں لگائے تھے۔ ایک boys کے لئے ہاسٹل نہیں لگائے تھے، پہلی بار کریم نگر میں کے سی آر صاحب اس قدے ایک ہاسٹل دے تھے، ابھی 70 residential schools, S.C. development کا اسکول چل رہا ہے، ویسے ہی سب دی کی ہی facilities ضرور اچھے facilities سے English medium school چل رہا ہے، وہی facilities وہ ضرور implement کریں گے، اس کا post بھی sanction کئے تھے، وہ جو اچھا اسکول چلایا گیا، میں سمجھتا ہوں کہ وہ لون کے بارے میں ہو یا پھر پرانے شہر کی ترقی کے بارے میں ہو، Quli Qutub Shah Urban Development Authority کے بارے میں ہو ضرور کریں گے، اس سے پہلے جیسے تھا ویسے نہیں چلے گا، اچھے طریقے سے چلانے کی کوشش کریں گے، جو آپ کا demand ہے اس سے پہلے discussion کئے تھے، وہ sort out کرنے کا کام چل رہا ہے، سی ایم صاحب اس کے اوپر دھیان دے ہوئے ہیں، وہ ایک کریں گے۔ Minorities Welfare Scholarship ہے 2013-14 کا پورا payment ہو گیا۔ 2014-15 کا پورا payment کیا ہے، تھوڑا RTF جو MTF پورا pay کیا ہے، جو RTF ہے تھوڑا confusion ہے، 200-300 کروڑ اس لئے وہ رہ گیا ہے، وہ بھی حساب آنے کے بعد ضرور sort out کریں گے۔ ضرور وہ پیسے دے دئے جائیں گے، اور جو 2015-16 academic year ہے ابھی NDF already release کئے ہیں، 2-3 دن میں students' account میں آرہے ہیں۔ اور جو شبیر بھائی کا issue ہے---

షబ్బీర్‌గారు చెప్పింది చాలా పెద్దసబ్జెక్టు. ఇంతకుముందు నేను చెప్పినప్పటికీ, on-record ఉంటుంది కాబట్టి, రికార్డులో ఉంటే మళ్లీ అడగడానికి ఆస్కారం ఉంటుంది కాబట్టి, చెబుతున్నాను. ఒక లక్ష కోట్లకు Revised Estimates ప్రాక్టికల్‌గా లేవు, వాస్తవానికి దూరంగా ఉంది అన్నారు. బాగానే ఉంది. మనకు చివరి క్వార్టర్‌లో మంచి రెవిన్యూ వచ్చే అవకాశం ఉంది. అలాగే గ్రోత్ బ్రహ్మాండంగా ఉంది. ఈ క్వార్టర్‌లో కేటాయించిన డబ్బు పూర్తిగా ఖర్చు కాగల ఆస్కారం ఉందని చెబుతూ, ఇంకొక విషయం కూడా చెప్పాను. కొన్ని contra interests కూడా ఉంటాయని చెప్పాను. తెలంగాణ ప్రభుత్వం ఈ రోజు ఆశగా ఉంది. ఆ ఆశ కేవలం ఆశగానే కాకుండా, ప్రాక్టికల్‌గా మారాలని కోరుకుంటుంది కాబట్టి, తప్పకుండా లక్ష కోట్ల R.E. కి సంబంధించి, ఒక ఆరు నెలల్లో C&AG నుండి మనకు రిపోర్టు వస్తుందని భావిస్తున్నాను.

Per capita Income విషయంలో మీరు చెప్పింది నిజం. హైదరాబాద్ మరియు ఆదిలాబాద్ per capita incomeకి జమీన్, ఆస్మాన్‌కి ఉన్నంత తేడా ఉంటుంది. మన దేశంలో per capita income Rs.93,000 ఉంటే, Rs73,000 per capita income మన రాష్ట్రంలో ఉన్న మాట వాస్తవం. అందువల్లనే out of 10 districts, 9 districts backwardగా గుర్తించబడి, మనకు కేంద్రం నుండి నిధులు వచ్చిన మాట వాస్తవం. ఈ అంతరాలు తొలగిపోవాలని, ఆదిలాబాద్ కావచ్చు, మహబూబ్‌నగర్ కావచ్చు, లేదా ఖమ్మం కావచ్చు, అన్నిటినీ కూడా సమగ్రమైన అభివృద్ధి పథంలో నడిపించాలని చెప్పి, infrastructre development విషయంలో గాని, నీటి విషయంలో గాని, ప్రాజెక్టులను టేకప్ చేయడం జరుగుతున్నది.

మైనారిటీ సంక్షేమం గురించి ప్రభుత్వం ఈ రోజు వంద శాతం చిత్తశుద్ధితో ఉంది.

میں بچپن میں عطاپور میں رہتا تھا۔میں پلٹن میں بھی رہتا تھا۔میرے اسکول کے زمانہ میں میں Railway Station کے بازو تھا،ہم دیکھتے تھے کہ وہ دیوڑی میں رہتے تھے، مسلمان کیسے تھے،ہم کو معلوم ہے۔

మైనారిటీలు నిజాంకు వారసులే కావచ్చుగాక, కాని నిజాం అంత రిచ్‌గా లేరు. సచార్ కమిటీ రిపోర్టు వచ్చిన తరువాత ముస్లిం మైనారిటీలు ఎలా జీవిస్తున్నారో అర్థమయింది. సచార్ కమిటీ అమలు కావాలని నేను ధర్నా చేసా, నేను అసెంబ్లీలో ఆ నాడు మాట్లాడాను కాబట్టి, మళ్లీ మేము లేవనెత్తిన ఆ నాటి ఇష్యూస్‌ని మళ్లీ మేము ప్రశ్నించుకునే స్థాయికి రావద్దనే, ఈ రోజు మేము ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నాము. ఈ సంవత్సరం వంద శాతం సమస్యల పరిష్కారం జరుగుతుంది. అది ఉర్దూ అకాడమీ కావచ్చు, వక్ఫ్ బోర్డు కావచ్చు, లేదా మైనారిటీ సంక్షేమ శాఖ కావచ్చు. అవసరమైన పోస్టులు మంజూరు చేయడం జరిగింది. ఇప్పటికే విలువైన భూములు పోయినాయి. ఇక మీదట ఆక్రమణలు కాకుండా చూడవలసిన అవసరం ఉంది. హుస్సేని షావలి దర్గా భూముల గురించి పోరాడింది తెలంగాణ ప్రభుత్వమే. మొన్న కోర్టుల ద్వారా 380 ఎకరాల భూమిని కూడా తీసుకువచ్చింది ఈ ప్రభుత్వమే. ఖులీకుతుబ్ షాహీకి కొంత నిధులు కేటాయించి, పాత బస్తీని అభివృద్ధి పరుస్తాము. వచ్చే సంవత్సరం R.E. లో కేటాయించిన బడ్జెటు పూర్తిగా ఖర్చు కాగలదని ఆశిస్తున్నాను.

బడ్జెట్ అలకేషన్ ఏ విధంగా జరుగుతుందనేది నేను వివిధ సందర్భాలలో చెప్పాను. Maximum Expenditure, Plan and Non-Plan put together 88%. The lowest ten years experience is only 67%. కానీ, ఈ రోజు మనం కొత్త రాష్ట్రం అయినా కూడా, మొదటి సంవత్సరం కంటే కొంత మెరుగు పడ్డాము. ఆ రోజు 62 శాతం ఉంటే, ఈ రోజు 82 శాతానికి వచ్చాము. తరువాత అది 90 శాతానికి వస్తుందనే ఆశతో ఉన్నాము.

అలాగే వాటర్‌గ్రిడ్ పథకానికి కేంద్రం నుండి కొంత సహాయం అందువచ్చని ఆశిస్తున్నాము. మనం కూడా బడ్జెట్‌లో కొంత కేటాయించుకున్నాము. అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్ల కొరకు Urban House Scheme నుండి, అలాగే Rural Housing Scheme నుండి కేంద్రం నుండి కొంత ఫండింగ్ రావడానికి ఆస్కారం ఉంది. హడ్కో నుండి రాష్ట్రప్రభుత్వం రూ.3,344 కోట్ల రుణం తీసుకోవడం జరిగింది. ఈ

సంవత్సరానికి 2,64,000 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే టార్గెట్ ఉంది. దాన్ని పూర్తి చేస్తామనే విశ్వాసం మాకు ఉంది. బడ్జెట్‌లో మనం పెట్టుకున్న 1.03 లక్షల కోట్ల రూపాయలు ఉంది. Within the budget or outside the budget, ఈ టార్గెట్ చేరుకుంటామని నేను భావిస్తున్నాను. అప్పుల కోసం మేము ఆరాటపడటం లేదు. ఆచితూచి, మన పరిధిలోనే, రాబోయే కాలంలో ఎటువంటి ఇబ్బంది రాకుండా ఉండే పద్ధతిలోనే చేసుకుంటూ పోతాము. రైతు ఋణమాఫీ క్రింద రూ.4,250 కోట్లు ఖర్చు ఉంటుంది. వచ్చే సంవత్సరం అంటే 2018–19 నాటికి అది ముగిసిపోతుంది కాబట్టి, ఆ డబ్బునే ఈ పథకాలకు కేటాయించుకుని, అవులు కొనసాగించాలనుకుంటున్నాము.

ఈ విషయంలో గౌరవ సభ్యులకు అంత confusion అక్కరలేదు. ఈ రోజు కరవు విషయంలో కూడా తెలంగాణ ప్రభుత్వం కొంత కమిట్‌మెంటుతో ఉంది. కాబట్టి అన్ని పరిస్థితులను బేరీజు వేసుకుని, ఉన్నంతలో కొంత మంచి చేసే ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్: చాలామంది సభ్యులు మాట్లాడాలనుకుంటున్నారు. కానీ సమయాభావం వల్ల వారి కోరికను మన్నించలేక పోతున్నాము. ఒకరికి ఇచ్చి, ఒకరికి ఇవ్వకపోతే బాగుండదు. కాబట్టి, 21 మార్చి, 2016 సోమవారం ఉదయం పదిగంటలకు తిరిగి సమావేశం కావడం కొరకు సభను వాయిదా వేయడమైనది.

(Then the House is adjourned at 2.37 P.M. to meet again at 10 A.M. on Monday, 21st March, 2016)

☺☺☺

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”**